# ధర్మం శరణం గచ్ఛామి

- సౌగంధిక

ధర్మానికి, అధర్మానికి మధ్య ఒక చిన్న గీత. కానీ, మనం మన అవసరాల కోసం ఆ గీతని జరిపేస్తూ ఉంటాము. మరల, మనకి మనమే ధర్మబద్ధం గానే జీవిస్తున్నామని సర్ది చెప్పుకుంటున్నాము.

మరి ఈ ధర్మానికి పరిమితులు, సరిహద్దులు ఏవి? ఇదే ధర్మమని, ఇవే సరిహద్దులని నిర్దేశించినదెవరు? సనాతన ధర్మానికి, ఇప్పటి ధర్మానికి సరిహద్దుల్లో మార్పులు వచ్చాయా?

ధర్మం నాలుగు పాదాలతో నడిచిన ఆనాటి యుగాన్ని, తదుపరి వొంటికాలితో నడుస్తూ, ఇప్పుడు, కుంటుకుంటూనో, లేక అసలు కాళ్ళే లేవోమో అని సందేహం కలుగుతున్న ఈ యుగాన్ని పోలిస్తే, మరి సరిహద్దులు మారినట్టే అనుకోవాలా?

దొంగ కూడా దొంగతనం చేసి, నాకు అవసరం కాబట్టి, నా చేత మరొక వ్యక్తో, ఒక సంస్థో చేయిస్తున్నారు కాబట్టి, ఇది కూడా ధర్మం అని అంటాడు. మరి నిజంగా అది ధర్మమేనా?

ఎన్నో అక్రమాలు చేసి సంపాదించిన ధనమును దానం చేయడం, దాతృత్వం అనిపిస్తుందా? అది ఎంత వరకు ధర్మం అవుతుంది?

---

## ధర్మానికి సరిహద్దులు జరిపేసిన ప్రతి ఇంటి కథ

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. తమ తమ స్వప్రయోజనాల కోసం విడిపోతే తప్పులేదు అని విడిపోయారు. కానీ, అందులో స్వార్థచింతన ప్రభావం ఎక్కువైంది. ప్రతి కుటుంబానికీ నివసించడానికి ఒక ప్రత్యేక ఇల్లు అవసరమైనది. తద్వారా ఖర్చులు ఎక్కువయ్యాయి. ఒకే ఉమ్మడి కుటుంబం నుండి విడిపోయిన రెండు కుటుంబాలలో ఎన్నో పొరపొచ్చాలు. కారణం, చదువుకున్న వాడికి నికరమైన ఆదాయం, వ్యవసాయం

www.sirimalle.com

చేసుకున్నవాడికి ఎగుడు దిగుడు ఆదాయం. రెండు సంసారాల్లో అసంతృప్తి. పిల్లల్లో అసహనం. ఉద్యోగస్తుడు నేను, నా భార్య, నా పిల్లలు అనుకున్నాడు. అది లోభాత్వనికి దారి తీసింది. వ్యవసాయదారుడికి అప్పులెక్కువయ్యాయి. వేరే దారిలేక అడ్డదారి సంపాదనకి మనసు ప్రేరేపించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.

అందరూ కలిసి ఉన్నప్పుడు, ఇంటిల్లిపాది ఒకరి గురించి ఒకరు ఆలోచించేవారు. అనుబంధం, ఆత్మీయత, అనురాగాల మిళితమై అసూయ ద్వేషాలు లేకుండా కలిసివుండడం మా ధర్మం అనుకునేవారు. తరువాత, తమ కుటుంబం గురించే ఆలోచిస్తున్నారు. అదీ ధర్మమేనని గీత జరిపారు. ఇప్పుడు, నేనే, నేనొక్కడినే, నన్ను నేను చూసుకోవడం అత్యంత ముఖ్యమని, అవసరమని, నేను బ్రతికి ఉండేంతవరకూ, నాకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని, పిల్లల అవసరాలకి కూడా ఖర్చు పెట్టడం మానేసి వృద్ధాప్యం కోసం దాచిపెట్టుకుంటున్నారు కొందరు.

ఈ నేను, నేనొక్కడినే అన్న మనస్తత్వం ఒక ప్రక్క తల్లిదండ్రులకి వృద్ధాశ్రమాలలో జీవించే పరిస్థితిని తీసుకొచ్చింది. మరొకప్రక్క, పిల్లలకీ వారి భవిష్యత్తు కోసం ఇల్లొదిలి వెళ్ళే గతి పట్టింది (ఇలాంటి మార్పులు ముందుగా పాశ్చాత్య దేశాలలో ఎక్కువగా వచ్చింది. ఇప్పుడు మనలో కూడా ఇలాంటి సంసారాలు లేకపోలేదు).

ఈ మార్పును మనిషి సామాజిక మార్పు, సరికొత్త చైతన్యం, సౌకర్యవంతమైన విలాసం అని అనుకుంటున్నారు. కానీ అందరూ వున్ననూ ఎవ్వరూ లేక ఒంటరైపోతున్నాడు. మేకపోతు గాంభీర్యంతో ఈ వొంటరి మనిషి ఇదే ధర్మం అంటున్నాడు. అహహ !!!

చూశారా! ధర్మ గీతని ఇంకెంత జరిపేశారో!! మరి అధర్మం పరిధిలో ఉన్న ధర్మ గీత, ధర్మం అన్నా, అది ధర్మం అవుతుందా?

ఒక్కప్పటి ఉమ్మడి కుటుంబానికి ఉన్నలక్ష్యం/లక్షణం, ఇప్పటి వొంటరి మనిషి లక్ష్యం/లక్షణం ఒక్కటేన ?? మరి ఈ ఆలోచనా సరళిని ఎలా మార్చాలి? ఆ ధర్మ గీతని అధర్మ సరిహద్దులనుండి మళ్ళా ధర్మ పరిధిలోకి ఎలా రప్పించాలి? ఉమ్మడి కుటుంబ వ్యవస్థే పరిష్కారమా? లేదా తను ఎటువంటి స్థితిలో ఉన్నా,మానవత్వం

www.sirimalle.com

కలిగి, సాటి మనిషి అవసరాలకు ఆదుకుని, సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించగలిగే ఔన్నత్యము ఉండటం పరిష్కారమా?

## కాలానుగుణంగా వచ్చిన మార్పులతో జరిగి పోయిన ధర్మ గీత !

ఒకానొకప్పుడు ఒక బట్టలు నేసే వాడు కొంత పెట్టుబడి పెట్టి మగ్గం కొని చిత్ర విచిత్రమైన రంగులతో, హంగులతో నేసి బజారుకి తీసుకువెళ్ళి తానే అమ్మే వాడు. కానీ తను అనుకున్నంత అమ్మలేక, నిరాశ తో ఇంటికి వచ్చే వాడు. అప్పుడు ఒక చుట్టం, 'అన్నా! నీకెందుకు ఇంత కష్టం? నువ్వు నేస్తే, నేను బజారుకి తీసుకెళ్ళి అమ్ముతాను. నాకు చాలామంది తెలుసు. అంతే కాకుండా, చుట్టూ ఉన్న గ్రామాల్లో కూడా తిరిగి అమ్మగలను. కాకపోతే, నీ లాభంలో నాకు వాటా ఇవ్వు, లేదా, నాకు తక్కువ ధరకి అమ్మితే, నాద్వారా నీ బట్టలన్నీ అమ్ముడు పోతాయి. రోజుకి 10 పైసలు రాబడి బదులు, రూపాయి రాబడి వస్తుంది' అని చెప్పాడు. బట్టలు నేసే వాడు ఆశపడ్డాడు. అందుకు ఒప్పుకొన్నాడు.

మరి ఆ చుట్టం అంతటితో ఆగిపోలేదు. ఇతడికి తెలివి ఎక్కువ. వ్యాపార మెళుకువలు తెలుసు. కాబట్టి, క్రమేణా, నేసే వాడికి అవీ ఇవీ చెప్పి, ఇంకా తక్కువ డబ్బులు ఇస్తూ వచ్చాడు. డబ్బు మీద వ్యామోహం పెరిగి, 'ఈ పాత మగ్గం తో నేస్తున్న ఇతడి ద్వారా తక్కువ బట్టలే వస్తున్నాయి, ఈ యంత్ర పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి, క్షణంలో బోలెడంత తానులు ఇవ్వగలిగే మగ్గం నేసే కొనుక్కుంటే, నా వ్యాపారం నేనే చేసుకోవచ్చు' అని, ఇప్పటివరకు వొచ్చిన లాభంలోంచి కొంత డబ్బు పెట్టుబడిగా పెట్టి ఆధునిక యంత్రం ఒకటి కొనుక్కుని తనే గుడ్డలు నేసి అమ్మడం మొదలు పెట్టాడు. తనకి ఒక దారిని చూపించిన వాడిని పూర్తిగా తప్పించేయడం మరి ధర్మమా? ఒక్కనాడన్నా, వెనక్కి తిరిగి చూసుకొని 'నేను ఈనాడు ఈ స్థితిలో ఉన్నానంటే అతనే కారణమని' ఆలోచించి భాగస్వామిని చేశాడా? మొండి చెయ్యి చూపించి తనదారి తాను చూసుకున్నాడు.

తన వారసత్వంగా వొచ్చిన విద్య, బట్టలు నేయడం. కాని ఒక ప్రక్క డబ్బులు ఎక్కువగా పెట్టి ఆధునిక యంత్రాలు కొనలేక, మరో ప్రక్క ఈ చుట్టం లాంటి దళారుల మోసాలకి బలై రోడ్డు మీద పడ్డాడు మన మొదటి బట్టలు నేసేవాడు.

www.sirimalle.com

ఇప్పుడు ఉన్న ఏ పరిశ్రమని తీసుకున్నా ఇంచుమించు ఇదే రకంగా మార్పులు వచ్చాయి. చిన్న చేపని పెద్ద చేప మింగేసినట్టు, ఇప్పుడు ప్రతి వొక్కడిని ఆధునిక పరిజ్ఞానం, యంత్రాలు, పరికరాలు మింగేసాయి, చివరికి చుట్టాన్ని కూడా! ఇప్పుడు మనుషులని తీసేసి ఆ స్థానాన్ని మరమనుషులు ఆక్రమిస్తున్నాయి. దాని ప్రభావం నేటి ఆర్థిక సమస్యలకు హేతువైనది. అధునాతికంగా ఈ వ్యవస్థ పెంపొందినందుకు ఆనంద పడాలో, గర్వపడాలో, లేక ఈ ఆధునిక యంత్రాలు, పేదవాళ్ళ పొట్ట కొట్టినందుకు విచారపడాలో, తలవంచుకోవాలో, ఒక్కో సారి అర్థం కాదు మనకి !

అప్పటినుండీ, ఇప్పటి వరకు వచ్చిన మార్పులు చూస్తే, అరే! ఇది సహజమే కదా! ఇందులో తప్పేముంది అని అనిపిస్తుంది. అంతా ధర్మమేగా! కాలానుగుణంగా మార్పులు రావడం సహజం, ఇది మన తప్పు కాదు, అని అనుకుంటాము. కాని కొంచెం అంతర్గతంగా ఆలోచించి చూస్తే, బట్టలు నేసే వాడి జీవిత సమస్య పరిష్కరిస్తానని వచ్చిన చుట్టం, అతని జీవితమే ఒక సమస్యగా మార్చేశాడే!! ఎన్ని తరాల వెనక్కి వెళ్తే ఈ ధర్మ గీతని సవరించగలం? నేటి సమాజంలో అదే దీన స్థితిలో బతుకుతున్న ఎంతమంది జీవితాలకి ధర్మభిక్ష పెట్టగలము? మన ప్రభుత్వాలు, ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పాటుపడుతున్నాయి, ఆ పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలని. కాని అంతకు మించిన వేగంతో ఆధునిక ప్రపంచం ముందుకి పరిగెడుతున్నది. మరి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, మన సంస్కృతిని పరిరక్షించాలనే సంకల్పంతో, ఈ సమస్యను ఇంకా తీవ్రంగా పరిగణలోకి తీసుకుని వృత్తులు కోల్పోయిన, కోల్పోతున్న అభాగ్యులని ఆదుకోవాల? లేదా ఆధునిక ప్రయోగాలతో, క్రొత్త పోకడలతో పరుగెడుతున్న ప్రపంచాన్ని మార్పు అనుకొని సర్దుకుపోవాలా?

## పలు భీమా పథకాలతో అలసి పోతున్న ధర్మ దేవత !

ఒక ధర్మానికి తలుపు తెరచి ఇంకో అధర్మానికి చోటిస్తున్న పలు రాజ్యాంగ సవరణలు ఈనాటి మరొక్క కీలకమైన సమస్య. ఎప్పుడు మొదలైందో 'భీమా' అన్న ఆలోచన. ఒక మంచి జరగాలని, ఒకరి పెట్టుబడిని సంరక్షించాలని, భీమా ఇస్తున్న సంస్థకి కూడా లాభం ఉండాలని మొదలు పెట్టిన ఈ పథకాన్ని రెండు ప్రక్కల వారు (అంటే వినియోగదారులు, సంస్థలు) అధర్మంగా వాడుకుంటూ కలుషితం చేస్తున్నారు.

www.sirimalle.com

ఎన్నెన్నో భీమా పథకాలు! ఇంటికీ, వాహనాలకీ, ఆరోగ్యానికీ, జీవితానికీ, ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. రాజ్యాంగంలో ఆమోదించినప్పుడు అందరు శ్వాస తీసుకున్నారు. కానీ, అసలు విషయం బయట పడింది నిజంగా మనం ఇబ్బందిలో పడినప్పుడు. డబ్బు కట్టించుకునేటప్పుడు సంస్థలు ఆనందంగా తీసుకొని, మనకి తిరిగి డబ్బులు ఇవ్వాల్సి వచ్చినప్పుడు రకరకాల నిబంధనలు చూపించి తక్కువ ఇవ్వడం, లేదా ఎగ్గొట్టడం అలవాటయ్యింది. అందుకు ప్రతిచర్యగా వినియోగదారులు ఇంకోరకంగా తప్పుడు దారులు త్రొక్కడం మొదలు పెట్టారు. అప్పుడు మరలా కొన్ని రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చారు. ఆ సవరణల వలన లబ్ది పొందింది ఎవరు అంటే సమాధానం దొరకదు. ఎందుకంటే నిజాయితీ పరుడైన వినియోగదారుడు ఎల్లప్పుడూ నష్టపోతూనే వున్నాడు.

సరే, వాహనాలు, ఇల్లు, వస్తువులకి సంబంధించిన పథకాలు ప్రక్కన పెడదాం. కుదిరితే ఇంకో వాహనం కొనుక్కుంటాం, లేదా ఉన్న ఇంటిలో మనకి కుదిరినప్పుడు మరమ్మత్తులు చేయించుకుంటాం. కానీ, అతి గగుర్పాటు కలిగించే పథకం ఆరోగ్య భీమా పథకం. ముఖ్యంగా అమెరికాలో ఉన్న పలు ఆరోగ్యభీమా పథకాలు.

క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకుంటే అనేక రకములైన ఆరోగ్య రుగ్మతలని ముందుగానే పసికట్టి తగు జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నది చాలా మంచి ఆలోచన. ముఖ్యంగా 40 ఏళ్ళ వయసు పైబడితే కొన్ని ముఖ్యమైన పరీక్షలు అవసరరం. ఆరోగ్యభీమా ఉన్నవారికి ఈ పరీక్షలన్నీ ఉచితం. ఇది నిజంగా ఆనందం కలిగించే విషయం. మరి ఆ ఆనందానికి కొన్ని అవధులు నిర్మించారు ఒక సంస్థగా ఏర్పడిన ఆసుపత్రుల యాజమాన్యం.

వీధి ప్రక్కన డాక్టర్ దగ్గరకయితే, మనకి అవసరం ఉన్నప్పుడు మాత్రమే వెళ్తాం, మందు వ్రాస్తాడు, కొనుక్కుంటాం, వేసుకుంటాం. వ్యాధి కొంచెం ముదిరితే, పెద్ద ఆసుపత్రికి వెళ్తాం. కొంచెం ఎక్కువ ఖర్చు అవుతుంది. అవసరం కాబట్టి డబ్బులు కడతాం, పని జరుగుతుంది.

ఇప్పుడు, ఇక్కడ వచ్చిన చిక్కేమిటంటే, ప్రతి సంవత్సరం క్రమంతప్పక చెకప్ చేయించుకుంటే మనకి లోపాలు ముందుగా తెలుసుకోవచ్చు. కాకపోతే మన ప్రమేయం లేకుండానే మరిన్ని పరీక్షలకి లోనవ్వడం,

www.sirimalle.com

పెరసి ఉచితమైన పరీక్ష నుండి, పరీక్షలో ఏదో బయటపడింది అని మరిన్ని పరీక్షలు చేసుకొనే అవసరం పడి, వేల డాలర్లు సమర్పించు కోవడం ఆనవాయితయ్యింది. ఇంకా క్లిష్టమైన పరీక్షలు చేయాలన్నపుడు మనీ తో పాటు పడే మనోయాతన పగవాడికి కూడా వొద్దనిపిస్తుంది. మనకి కొంత పరిజ్ఞానం ఉండి వాదిస్తే వదిలేస్తారు. లేదంటే అనవసరమైన ఖర్చు, భయం. ఇంకో చెడు నిజం ఏమిటంటే రెండు మూడు సార్లు పరీక్షలు చేసిన తరువాత ఏమిలేదని చెప్పడం కూడా జరుగుతుంది. వారి దృష్టిలో అది చాలా సహజం కానీ మనకు మానసిక నరకయాతన. ఇండియాలో చనిపోయిన వారిమీద పరీక్షలు చేసి డబ్బు వసూలు చేసే ఆసుపత్రులకి, ఇక్కడ బ్రతికి ఉన్న మనిషిని మానసికంగా చంపేసే ఆసుపత్రికి తేడా లేదనిపిస్తుంది.

ఇంతకీ జరుగుతున్నదేమిటంటే, అందరూ ఆరోగ్యంగా ఉన్నారు అంటే ఆసుపత్రి కి డబ్బులు రాలవు కదా! అక్కడ పని చేసే వారికి మరి జీతాలు ఎలాగా? వారు వాడే పరికరాలకి పెట్టుబడి ఎలా? అలా అని లేని రోగం కోసం పరీక్షలు చేసి డబ్బులు గుంజడం సమంజసమా? ఎంతమందికి నిజంగా ఆ పరీక్షలకి అదనంగా డబ్బులు కట్టే పరిస్తితి ఉంటుంది?

ఇది ఈనాటి ఆసుపత్రులు, వారు అలవాటు పడిన మార్గాలు!! మరి ఇది ధర్మమా?

## పాశ్చాత్య సంప్రదాయాన్ని అడ్డుపెట్టుకుని అధర్మ మార్గాలల్లో నడుస్తున్న యువతరం!

ప్రతి జాతికీ, ప్రతి ప్రాంతానికీ, ప్రతి దేశానికీ సంప్రదాయపరంగా ఒక నిర్దిష్టమైన గుర్తింపు ఉంది. ఒక ప్రత్యేకత ఉంది. కనుక అందుకు గర్వపడాల్సిన అవసరం ఉంది. మనం వేరే సంస్కృతి నుంచి మంచిని గమనించి ఆచరించాలి కాని మన సంస్కృతిని మరిచిపోయి వాతలు పెట్టుకొనేవిధంగా మాత్రం కాదు. గత పది, ఇరవై సంవత్సరాలుగా పాశ్చాత్య సంస్కృతి మోజులో అదే జరుగుతున్నది. ముఖ్యంగా యువతరం అదేదో అద్భుతమైన, అందమైన లోకమనే భ్రమలో వాతలే పెట్టుకుంటోంది. తాగడం, బట్టలు వేసుకోవడం, క్లబ్స్ కి వెళ్ళడం మొదలైన విషయాలలో యువతరం ఆ పాశ్చాత్యులను అనుకరిస్తుంది కానీ అందులోని నిజమైన విలువలను మాత్రం అనుసరిచడం లేదు.

www.sirimalle.com

చలి ప్రాంతాలలో మద్యపానం అవసరం అన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలు జీన్స్ వేసుకోవడం కూడా చలిని ఆపడానికని ఎంత మందికి అర్థమైంది? బీచ్ కి వెళ్లి సన్ బాత్ చెయ్యడం కూడా వారి ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలు. అదే మనవాళ్ళు ఫాషన్ అనుకొని పొట్టి పొట్టి నిక్కర్లు, స్కర్ట్స్ వేసుకుంటే ఎంతో ఎబ్బెట్టుగా ఉంటుంది? ఉష్ణ ప్రదేశాల్లో నివసిస్తున్న మన చర్మ రంగుకు, శీతల ప్రదేశంలో వుండే పాశ్చాత్యుల చర్మ రంగులో తేడా వుంటుంది. మనకు కావలిసినంత సూర్యరశ్మిని ఎల్లప్పుడూ పొందుతూనే ఉంటాము కనుక మనకు సన్ బాత్ ల అవసరం లేదు. ఆ విషయం ఎంతమందికి అవగతమౌతున్నది?

అది అలాపెడదాం. కొందరు ప్రబుద్ధులు ఒక అమ్మాయి వేసుకున్న బట్టలు చూసి అంగలార్చి అదే తన చెల్లి, తన భార్య వేసుకుంటే నానా హంగామా చేస్తారు. అదే పాశ్చాత్య దేశంలో అలాంటివి పట్టించుకోరు కదా? అది నేర్చుకున్నారా మనవాళ్ళు?

పాశ్చాత్య దేశంలో, ఇంటి పనుల్లో, వంట పనుల్లో మగవాళ్ళు, ఆడవారు అనే భేదం లేకుండా ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. మరి అది మంచి సంప్రదాయం కాదా మనవాళ్ళకు? వాళ్లు కొన్ని సంవత్సరాలుగా కలిసి ఉండి, ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అభిప్రాయం ఒకరు గౌరవించి ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. మనలో కొందరు పెళ్లి అయ్యిన కొద్దిరోజులకే మోజు తీరిపోయిందని చిన్న సంసారం పెట్టుకుంటారు. ఇంక, కొన్ని సంవత్సరాలు పెళ్లి ముందు కలిసి ఉండటం, ప్రేమించడం అన్నది ఎంత సాధ్యం? అయితే, మన సంస్కృతిలో వున్న అనుబంధాలు, ఆప్యాయతలు, పరిస్థితులకు తలొగ్గి సర్దుకుపోవడం, నైతిక విలువలను పాశ్చాత్యులు కూడా అనుకరిస్తున్నారు. కానీ మనం వాళ్ళ సంస్కృతిలో వున్న విడాకుల పధకాన్ని మాత్రం పాటించాలని తెగ ఉవ్విళ్ళూరుతున్నాం. మరి ఇది ఎంతవరకు సమంజసం.

పది మంది గర్ల్ ఫ్రెండ్స్, బాయ్ ఫ్రెండ్స్ తో తిరగడం ఒక ఫాషన్ అయ్యింది. బట్టలు మార్చినట్టు గర్ల్ ఫ్రెండ్స్, బాయ్ ఫ్రెండ్స్ మార్చడం అలవాటు అయ్యింది. అది ఒక్కటి మాత్రం నేర్చుకున్నారు. కొందరికి పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నారంటే నామోషి.

పరిస్థితులు అనుకూలించక, ఇష్టం లేకున్నా భార్యాభర్తలు విడాకులు తీసుకోవలసి వస్తే ఎంతమంది సహృదయం తో అర్థం చేసుకున్నారు? వాళ్ళ ఇళ్ళల్లో అవసరానికి ఉండొచ్చు కాని తన కూతురికో కొడుక్కో

www.sirimalle.com

సంబంధాలు వస్తే వాళ్ళ ఇల్లు పనికి రాలేదే? తన కూతురి పెళ్లి అవ్వదేమోననే సంకుచిత మనస్తత్వం. మరి పాశ్చాత్యుల లాగా అలాంటివారికి మరో అవకాశం ఇవ్వడం తప్పు కాదు అన్నది నేర్చుకోలేదేమి?

మన దేశంలో నివసించే 99%, పాశ్చాత్య దేశంలో ఇలాగట అలాగట అని అవాకులు చెవాకులు చెప్పి అంతా దురభిప్రాయాన్నే కలిగిస్తున్నారు కాని, దాని వెనక నిజం ఎంత మందికి అర్ధమైంది? అర్థం పర్థం లేని తాగుడు, అర్థం పర్థం లేని క్లబ్బులు, అర్థం పర్థం లేని దుస్తులు. మాతృభాష తక్కువన్నట్టు ఆంగ్లంలోనే మాట్లాడటం, అడ్డమైన తిట్లు నేర్చుకుంటే అదేదో గొప్ప అయిన ఫీలింగ్. ఇది మనవాళ్ళు నేర్చుకుంది. ఎక్కడ వారికి అనుకూలంగా ఉందో అక్కడ మాత్రం వాతలు పెట్టుకొని సమాజాన్ని కలుషితం చేశారు, నెపం ఎదుటివారి మీద, సమాజం మీద, పాశ్చాత్య సంస్కృతి మీదా నెట్టేసి...

మరి ఇది ధర్మమా?

## మనం తరచూ వింటున్న దావాగ్నులు (ఫారెస్ట్ ఫైర్స్/వైల్డ్ ఫైర్స్) ఎన్ని నిజమైనవి?

ఈ ప్రమాదాలు ఎక్కువగా వేసవి కాలంలో వింటూ ఉంటాము. అయితే, గమనించాల్సిందేమిటంటే కొన్ని రోజులు వాతావరణం శీతాకాల వాతావరణం లాగ చల్లగా ఉంటుంది. కొన్ని వేసవికాలాల్లో అసలు ఎండలే ఉండవు. మరి అటువంటి రోజుల్లో కూడా ప్రమాదాలు అంటూ అగ్నిమాపక దళాలు తెగ తిరిగేస్తుంటాయి. చాల ఆశ్చర్యం కదూ? మనకి ప్రాంతీయ వార్తలలో చెబుతారు, ఎవరో సిగరెట్టు కాల్చి అక్కడ పడేశారని. అది ఎంత నిజం? అగ్ని అంటుకున్న తరువాత సిగరెట్టే అని ఎలా చెప్పగలిగారు? అంతా బూడిదైపోయిన తరువాత సిగరెట్టూ పీక ఎలా కనిపించిది? ఎంత హాస్యాస్పదం!!

కానీ ఒకటి మాత్రం నిజం. జరుగుతున్న ప్రకృతి విలయాలకు మనిషి కూడా ఒక విధంగా కారణభూతుడే. కొన్ని సందర్భాలలో మానవ తప్పిదాల వల్ల జరిగిన ప్రమాదాలు కూడా వున్నాయి. అయితే అది సిగరెట్టు వల్ల కాదు కానీ బాగా ఎండిన పొదల మధ్యన కొండలమీద కాంపింగ్ చేసి ఆ క్యాంపు ఫైర్ ఆర్పకుండా వచ్చేస్తే, గాలి ప్రభావంతో అది అంటుకుని వేల ఎకరాలు కాలిన సందర్భాలు వున్నాయి. అయితే ఇది ఒక ఉదాహరణ

మాత్రమే. ఇలాంటివి ఈ ప్రపంచంలో చాల జరుగుతున్నాయి. ప్రమాదాలు కృత్రిమంగా ఎక్కడ వీలైతే అక్కడ సృష్టిస్తున్నారు కూడా.

ఇంకొక రకమైన ఉదాహరణ, సాధారణంగా, ఒక సంస్థలో పని చేసేవాళ్ళకి సరైన పనిలేకపోతే వాళ్ళని ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉంది. అలా అని తీసివేస్తే, అవసరం వచ్చినప్పుడు ఏంచెయ్యాలి? అదీ సమస్య. అదీకాక యూనియన్ గొడవలు. అందుకని కృత్రిమమైన ఈ ప్రమాదాలు సృష్టించడం ఎంత వరకు సమంజసం? తద్వారా వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులకు ఆశ పడటం న్యాయమా?

గత శీర్షికలో, ఒక వయసు వచ్చిన తరువాత కొన్ని వైద్య పరీక్షలు ముందుజాగ్రత్తగా చెయ్యాలని నిర్దేశించిన రాజ్యాంగం, ఇంత ఆర్థిక, జన నష్టం జరిగే అవకాశం ఉన్న దావాగ్నుల విషయంలో ఎందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం లేదు? ఇంకొక విషయం. ఈ దావాగ్నులు ఒకసారి రాజుకుంటే అవి ఆరిపోవడానికి కనీసం రెండు మూడు రోజులు పడుతుంది. ఇంకా గాలి తోడైతే అది మరికొన్ని రోజులు వుంటుంది. అంతే కాదు, ప్రతిసారీ ఇలాంటి అగ్ని ప్రమాదాల వలన వాతావరణం కూడా ఎంతో కలుషితం అవుతుంది. అసలే కర్బన ధాతువులు వాతావరణం వేడెక్కడానికి దోహదపడుతున్నాయని శాస్త్రవేత్తలు ఘోషిస్తున్నారు. మరి ఇన్ని రకాలైన నష్టాలు కలుగుతున్నప్పుడు, ఇలాంటివి జరగనివ్వకుండా చెయ్యడం అవసరం కాదా?

అమెరికా లాంటి దేశంలో ఈ విషయంలో కొంచెం ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నారు. కానీ అవి ఆశించినంతగా లేవు. ప్రమాదానికి ఎక్కడ ఆస్కారం ఉందో, ఆ ప్రాంతంలో ముందు జాగ్రత్త చర్యగా అదుపులో పెట్టే ప్రయత్నం చెయ్యొచ్చు కదా? చెయ్యరు, ఎందుకంటే భీమాలో ఉన్న నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగినప్పుడే డబ్బులు వొస్తాయి. ఇలాంటి తిరకాసులు ఉండటం వల్ల నిజమైన ప్రమాదాలు జరిగినప్పుడు ధన నష్టంతో పాటు చాల జన నష్టం కూడా జరుగుతోంది. ఎటుతిరిగీ, భూకంపాలు, తుఫానులు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు మన చేతిలోలేవు. కనీసం చేతిలో ఉన్నవాటిని అరికట్టడానికి వీలులేని పరిస్థితులు కల్పించారు.

ఇది ఎంత వరకు ధర్మం?

www.sirimalle.com

# నాటి స్త్రీ విద్యావిధానం – నేడు సంఘంలో తెచ్చిన మార్పులు

చదువుకున్న అమ్మాయి అమ్మ అయితే తన పిల్లలకి ఒక వయస్సు వచ్చే వరకు వారి ఆలనా పాలనతో పాటు విద్యాబుద్ధులు కూడా నేర్పిస్తుంది అని మొదలైన నాటి ఆలోచన, నేడు మనం చూస్తున్న ఎన్నో సాంఘిక అనర్థాలకి కూడా కారణం అవుతున్నది. తప్పు అమ్మాయిలది కాదు. ఆలోచనా విధానం కూడా కాదు. అమ్మాయిల్ని, ఆ విధానాన్ని అడ్డుపెట్టుకుని ఆటలాడుతున్న కొందరు అవకాశవాదులది.

మొదట్లో, మనం గుర్తు తెచ్చుకుంటే, ఆడపిల్లలు లేదా మహిళల మొదటి ఉద్యోగం సెక్రటరీ. ఆ ఉద్యోగం చేసినవాళ్ళని చాలా చులకనగా చూడటం కూడా జరిగింది. డబ్బుకి అలవాటు పడిన మగవారు ఉద్యోగం చేసే భార్య కావాలనడం మొదలు పెట్టారు. ఆడపిల్లలకి చదువు అవసరం అన్న ఆలోచన కంటే చదివితే ఉద్యోగం చేస్తుంది, తల్లితండ్రులకి భారం తగ్గుతుంది అని ఒక ప్రక్క, పెళ్లి త్వరగా చెయ్యొచ్చు అని ఇంకో ప్రక్క ఆలోచించారు కాని, ఆడపిల్లలకి ఏమి కావాలి? అని ఎవ్వరూ ఆ కోణంలో దృష్టిపెట్టలేదు. ముఖ్యంగా మన దేశంలో. అలా వారిని ప్రేరేపించిన వారు మళ్ళా మరింత ఉన్నత విద్యలు చదవాలంటే అడ్డు చెప్పారు. కారణం, తల్లితండ్రులు తమ అమ్మాయి విశ్వవిద్యాలయ పట్టా తీసుకుంటే అంతకన్నా ఎక్కువ చదువుకున్న వరుణ్ణి మరింత ఎక్కువ కట్నంతో తీసుకురావాలని ఆలోచించి కళాశాల చదువు వరకే చదివించారు. ఎవరైనా కొంచెం విశాల దృక్పథంతో ఉన్నత విద్యనభ్యసిస్తే వారికి ఉన్నత పదవులు రాకుండా అడ్డు తగిలారు. ఉన్నత ఆలోచనలని అవహేళన చేశారు. అయితే, ఆడపిల్లలు బెదరలేదు. అలాగే వారిని ప్రోత్సహించిన మనుషులు కూడా లేకపోలేదు. ప్రస్తుతం ఇక్కడ మనం చర్చించుకోవలిసిన విషయం కొందరు అవకాశవాదులు ఎలా ఆ విధానాన్ని తమ స్వార్థప్రయోజనాలకు వాడుకున్నారు అన్నది.

కొందరు భర్తలకి భార్య ఉద్యోగం చెయ్యాలి, డబ్బులు సంపాదించాలి. కానీ, ఉద్యోగం లో తోటి వారితో ఏమౌతుందో అని చచ్చేంత అనుమానం. నిఘా వేస్తారు. అప్పుడప్పుడు రహస్యంగా ఆఫీసుకి వొచ్చి చూస్తుంటారు. నానావిధములైన ఆంక్షలు పెడుతుంటారు. మరికొంతమంది భర్తలు భార్యలు సంపాదించిన డబ్బునే వారికివ్వడానికి సవాలక్ష వంకలు పెడతారు. భార్య ఉద్యోగం చేస్తున్నను, తనే ఇంటి పని, వంట పని, పిల్లల బాగోగులు చూసుకోవాలి కానీ, ఉద్యోగం ఇద్దరూ చేస్తున్నాము, నావంతు సహాయం నేను చెయ్యాలన్న

www.sirimalle.com

ఇంగిత జ్ఞానం కొందరు భర్తలకు ఉండదు. పైగా, భార్య ఎక్కువ సంపాదిస్తుందంటే ఆమెకి గర్వం అని, ఎక్కువ సంపాదించక పోతే, నీవు చేస్తున్నదీ ఒక ఉద్యోగమేనా? అని తూలనాడటం కూడా మనం వింటూ ఉంటాము. భార్య సంఘంలో మంచి పేరు సంపాదిస్తుంటే నన్ను ఆమె భర్త అని అంటారేమో అని బయటికి కదలనివ్వక పోవటం లాంటి సమస్యలు తీసుకొస్తారు. కారణం, భార్య సంఘసేవ చేస్తుంటే లోకం వీరిని తక్కువగా చూస్తుందేమోనన్న ఒక విధమైన మానసిక భయం. ఏవిషయమైనా, నాకు పెద్దగా తెలీదండి, అంతా మా ఆవిడే చూసుకుంటుంది అని అనడానికి నామోషి. ఇక్కడ ఇంకోవిధమైన వర్గం వుంది. భర్తలు పూర్తిగా పరాన్నజీవులై అంతా భార్య మీదకు నెట్టివేసి తను హాయిగా నిద్రిస్తుంటారు. నీ కర్మ, నీవే కుటుంబభారాన్ని అంతా మోయ్. నేను నిన్ను గుడ్డిగా అనుసరిస్తాను అంటుంటారు. ఇదికూడా మంచిదికాదు. ఇద్దరూ కలిసిమెలిసి కుటుంబ భారాన్ని మోస్తూ ఒకరికొకరు చేదోడువాదోడుగా ఉన్నపుడే అది ధర్మం అనిపిస్తుంది.

భార్య ఒక మంచి సలహా ఇస్తే దానిని మెచ్చుకోవడం మానేసి నాకు ఆ ఆలోచన తట్టలేదే అన్న చిన్నతనంతో ఆ సలహాను కొట్టెయ్యడం ఈనాటి చాలామంది భర్తల అలవాటు. అదే ఆలోచన మరొక వ్యక్తి (ఆడ కాని మగ కాని) ఇస్తే, భార్య ఎదురుగానే దివ్యమైన ఆలోచన అని అమలు పెట్టడం కూడా చేస్తారు. ఒకానొకప్పుడు భర్తే కుటుంబ భారాన్ని మోస్తున్నను లేక భార్యాభర్తలు ఇరువురు కలిసి సంసార భాధ్యతలు నిర్వహించినను, నాడు స్త్రీలకు ఇచ్చిన మర్యాద, గౌరవం ఈనాడు లేదు అంటే అతిశయోక్తి కాదేమో! మరీ మన సినిమాలలో కూడా ఒసే, రావే, పోవే అని పిలవడం ఎంతవరకు సబబో నాకు మాత్రం అర్ధంకాలేదు. అదేమంటే ప్రేమతో, చనువుగా అలా పిలుస్తారు అంటారు. కానీ ఆదిశక్తి, మాతృశ్రీ, భూదేవి లాంటి పవిత్రపదాలతో విలసిల్లిన మహిళామూర్తులను కించపరిచే విధంగా పలకరింపులు అవసరమా!

కొందరి ఇళ్ళల్లో ఆడపిల్ల పెళ్లి జరిగి అత్తవారింటికి వెళ్లి పోతే, మమ్మల్ని ఎవరు చూస్తారు అన్న తల్లి తండ్రులు కూడా లేకపోలేదు. కొంతమంది తల్లితండ్రులు మేము నిన్ను ఆడపిల్లలాగా పెంచలేదు కదా అని అంటారు. మరి మగపిల్లల్ని పెళ్లి చేసుకోవద్దు అని అనరు కదా? పోనీ, ఆడపిల్లగా నన్ను పెంచలేదు కాబట్టి నా వారికి నేను సహాయం చెయ్యాలి. నేను సంపాదిస్తున్నాను మరియు నా భర్త వలన నాకు సంపద చేకూరింది. నేను ఇప్పుడు సహాయపడే స్థితిలో ఉన్నాను కాబట్టి నా పుట్టింటి వాళ్లను ఆర్ధికంగా ఆడుకోవడం నా కనీస ధర్మం

వాళ్ళు కూడా స్థితికి వచ్చేంతవరకు నేను వారికి అండగా ఉండాలి అని అనుకొంటే దానికి భర్త వొప్పుకోడు. ఇక ఆడవారికి మనశ్శాంతి ఎక్కడ ఉంది?

ఇపుడు వృత్తిపరమైన ఇంకొక లైంగిక వ్యత్యాసాన్ని చూద్దాం! కొన్ని ఉద్యోగాలకు మహిళలకు అర్హత లేదు కనుక ఆయా వృత్తుల్లో ఆడవాళ్ళని తీసుకోరు. మరి కొన్ని వృత్తుల్లో ఆడవాళ్లు, మగవాళ్ళు సమానంగా పని చేసినను ఆడవాళ్ళకి తక్కువ జీతం ఇస్తారు. ఆడవాళ్ళకి ఎటువంటి ప్రాముఖ్యత లేని పదవిని ఇస్తారు. స్త్రీలలో సామాజిక చైతన్యం వచ్చి ఇలాంటి విబేధాలు చూపిస్తే చట్టం వొప్పుకోదని, మరొక రకమైన సాకు చెప్పి తప్పించుకుంటున్నారు. మరి ఇక్కడ ధర్మం ఎంతవరకు పనిచేస్తున్నది?

ప్రస్తుత కాలంలో ఆడవాళ్ళలో కూడా మార్పు వచ్చింది. మేమూ దేనికీ తీసిపోము అనే పంతంలో వారు కూడా జల్సాలకు అలవాటు పడుతున్నారు. ఇంటికి ఆలస్యంగా రావడం, క్లబ్బులకు వెళ్లి త్రాగడం, స్నేహితులతో పార్టీలు తదితర విషయాలను కూడా ఒక కొలమానంగా తీసుకున్నారు. ఒకప్పుడు మగవాళ్ళు ఎటువంటి వెధవ్వేషాలు వేసినను, మహిళలు ఇంటిపట్టునే వుండి తమ వరకు కనీసం నిష్టతో ఉన్నందున పిల్లల ఆలోచనలు చెడుదారి పట్టకుండా నియంత్రణ వుండేది. కానీ నేటి కాలంలో మహిళలు, మగవారు ఇద్దరూ పోటీలుపడి సంఘంలో స్థాయి అనే ముసుగులో చెడు అలవాట్లకు చేరువైతే, వారి పిల్లల పెంపకంలో వ్యత్యాసాలు ఏర్పడతాయి. పర్యవసానం, సమాజ అభివృద్ధి మీద పడుతుంది. ఎలాంటి దుస్తులు వేసుకుంటే మగవారిని ఆకట్టుకోవచ్చు అన్న ఆలోచన ఎక్కువైంది. అసభ్యకరమైన దుస్తులు వేసుకోవడానికి కూడా వెనకాడటం లేదు నేటి ఆడపిల్లలు. ఎంత చేతులు చేతులు కలిపితే అంత సమానం అనుకుంటున్నారు. ఒకే రూములో ఉంటూ, ఒకే మంచంలో పడుకుంటే తప్పేముంది అనుకుంటున్నారు. పెళ్లి కాకుండానే సహజీవనం చేయాలనే ఆలోచన నేటి యువతలో ఉత్సాహాన్ని నింపుతున్నది. అది ఎంతవరకు ధర్మం. విచక్షణ జ్ఞానం కోల్పోయి వావి వరుసలు మర్చి పోతున్నారు.

ఇంట్లో ఆడపిల్ల ఉంటే లక్ష్మీ దేవి అనేవారు ఒకప్పుడు. ఇప్పుడున్న సమాజాన్ని చూసి ఆడపిల్లల్ని మేము పెంచగలమా అని కొందరు భయపడుతున్నారు. అమెరికా లాంటి దేశాల్లో పెంచడానికి భయపడి, మన దేశానికి తీసుకెళ్ళి, అక్కడ కన్నా ఇక్కడే ఎంతోనయం అని తలపట్టుకున్న తల్లి దండ్రులు ఎందరో.

www.sirimalle.com

ఆడపిల్లలని ఆడపిల్లల లాగే పెంచి వారికి సమానమైన హక్కులు ఇవ్వగలిగే సమాజాన్ని తయారు చెయ్యగలమా? ఆడపిల్లల లాగే అనడానికి కారణం, అందరూ మగవాళ్ళ లాగ ఉంటే, ప్రపంచం అందాన్ని కోల్పోతుంది. అలాగే అందరూ ఆడవాళ్ళుగా ఉంటే కూడా. వీరిరువురు సమపాళ్ళలో ఉన్నప్పుడే ప్రపంచం నిండుగా ఉంటుంది. వేడుకగా ఉంటుంది. ఒక చెల్లెలి బాధ్యత స్వీకరించిన అన్నగా, ఒక చెల్లిగా అన్న మీద అనురాగం, తమ్ముడి శ్రేయస్సు కోరే అక్కగా, ఇలాంటి బంధాలు లేకపోతే ఈ ప్రపంచం అనవసరం. ప్రస్తుతం ఇళ్ళల్లో, ఒకళ్ళ మీద ఒక్కళ్ళు పోటి పడుతున్నారు కానీ, ఆప్యాయతలు, అనురాగాలు తక్కువయ్యాయి. దానికి కారణం కూడా ఆడపిల్లల చదువులు. అన్నల్లో తమ్ముళ్ళో, నీకు ఏమి తక్కువ చెయ్యలేదు, మేము నీకెందుకు సహాయం చెయ్యాలి అన్న మనస్తత్వం చోటు చేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో వుంది. మరి ఈ కుటుంబ బంధాల విషయంలో ధర్మం దారితప్పిందా? ....

'ముల్లొచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకు వచ్చి ముల్లు మీద పడ్డా అరిటాకుకే నష్టం' అనే సామెతననుసరించి అదే జరిగింది అమ్మాయిలకి ఈనాడు. ఎక్కడి న్యాయం ఇది? ఏమి ధర్మం? ఇలాంటి ఊబిలో కొట్టుకు పోతున్న సమాజాన్ని ఎలా సంస్కరించాలి? అది సాధ్యమా? తల్లిదండ్రుల గడప దాటిన తరువాత కూడా తల్లిదండ్రులు ఇవ్వగలిగినంత రక్షణ, ధైర్యం ఆత్మ విశ్వాసం ఆడపిల్లకి ఇవ్వగలదా ఈ సమాజం? ఇరవై, ముప్పై ఏళ్ల నాడు ఇంకా చెప్పాలంటే 50 సంవత్సరాల నాడు స్త్రీకి రక్షణ లేదని ఎంతో ఆవేదన చెందేవారు. ఇప్పటికీ ఇంత అభ్యున్నతి, పరిణితి సాధించినను ఆడువారి రక్షణ విషయంలో ఎటువంటి మార్పు లేదు. దీనికి కారణం సమాజమే. మనిషి సంఘజీవి కనుక పరిసరాల ప్రభావం అతని ఆలోచనల మీద కూడా వుంటుంది.

ఆచరణ రూపంలో ఆ ప్రవృత్తే బయటకు వస్తుంది. కనుక ఈ సమస్యకు మూలాలను కనుగొని ఆ వేళ్ళను సమూలంగా నాశనం చేసినప్పుడే ఈ సమస్యకు పరిష్కారం దొరికి గాంధీ మహాత్ముడు ఆశించినట్లుగా అర్ధరాత్రి స్త్రీ ఒంటరిగా నిర్భయంగా తిరగగలదు. ఈ సమస్యకు అందరూ (చేతకాని వారు) సూచించే పరిష్కారం, అసలు ఆడది ఒంటరిగా ఎందుకు వెళ్ళడం? అర్ధరాత్రి పనులేముంటాయి? శుభ్రంగా ఇంట్లో వుంటే ఈ ఇబ్బంది వుండదు కదా! ఇది నిజమైన పరిష్కారం కాదు. పాశ్చాత్య దేశాల చెత్త సంప్రదాయాలను అలవాటు చేసుకోవాలనే తపన ఉన్నప్పుడు, అక్కడ ఒక మహిళ ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళగలుగుతుంది

www.sirimalle.com

మరిక్కడ ఎందుకు ఆ అవకాశం లేదు. ఇలా చర్చించుకుంటూ పోతే ఎన్నో విషయాలు ఉన్నాయి. మరిక్కడ ధర్మం నిజంగా వర్తిస్తుందా?

ఆడపిల్లలకి చదువొద్దు అంటే అన్యాయం. చదివిస్తే ఇది పరిణామం. చదువుకోవడం వల్ల జరిగిన నష్టం ఎలాగు జరిగింది ఇప్పటివరకు. కొంత మంది సంఘ సంస్కర్తల వల్ల ఒక ఇరవై శాతం వరకు బాగుపండింది. కానీ ఇంకా ఎనభై శాతం మనుషుల ఆలోచనలలో మార్పులు రావాలి. చదువుకోవడం అన్నది మగ పిల్లలకైనా, ఆడపిల్లలకైనా ఆర్ధిక స్వతంత్రం ఇచ్చే పరికరం అన్న ఆలోచన సమాజానికి కలిగిస్తే ఈనాటి కొందరి ఆడపిల్లల పరిస్తితి మెరుగు పడుతుందేమో? పదవుల కోసం, పేరు ప్రతిష్టల కోసం, మగవాళ్ళు, ఆడవాళ్లు పోటీ పడవలసిన అవసరం లేదని చెప్పగలమా? మరి ఇప్పటినుండైనా వారి చదువుని సరైన రీతిలో ప్రోత్సహిస్తూ, వారిని మరియు సంఘాన్ని సరైన తీరులో నడిపించాలంటే మనం ఇంకా ఏమేమి చెయ్యాలి?

## నా మాతృ మూర్తికి, నా మాతృ భూమికి నా శిరో వందనాలు!

అమ్మ అనే పదం ఎలా పుట్టిందో మనకి తెలియదు. కానీ, అమ్మ అని అనిపించుకోవడంలోని ఆనందం, అమ్మ అని అనడంలోని మాధుర్యం, అమ్మ అని తలచుకున్నప్పుడు కలిగే ఒక తెలియని తీపి అనుభూతి, కంటిలో ఏర్పడే ఒక పలుచని నీటి పొర, ప్రకృతి సహజ పరిణామాలు!

సహనము, శాంతము, మృదుత్వము లాంటి మాటలు అమ్మ అనే మాటకి పర్యాయ పదాలు. అందుకే అటువంటి లక్షణాలు కల వారిని ఎవరైనా, మన కన్న తల్లి కాకపోయినా, 'అమ్మ' అని మనకి తెలియకుండానే సంభోదిస్తాము. అలాంటి లక్షణాలు లేని తల్లిని పిల్లలు ఆదరించలేరు. చూసారా! మరి భూమాత, గోమాత అని ఎందుకంటారో!

తను అమ్మనైయ్యాను అన్నప్పటినుండి మొదలవుతుంది తల్లి బాధ్యత. ఎలా పెంచాలి, ఎలా పెద్ద చెయ్యాలి, ఎలా ప్రయోజకులని చెయ్యాలి అని. అది ఒక తియ్యని, తీరని వేదన. అందులోనే అమ్మకి ఆనందం ఉంది. తృప్తి ఉంది. ప్రయోజకులైన పిల్లల్ని చూసి లోలోపల మురిసిపోతూ, గర్వ పడుతుంది. పాడైపోతున్న పిల్లల్ని

చూసి ఆవేదన పడుతుంది. లోకం ఎంత కసిరి కొట్టినా కానీ, వారిని విడిచి పెట్టదు. ఎక్కడో ఒక మూల ఆశ తనకి, ఎప్పుడైనా తన పిల్లలు మారుతారని. అలా కడుపులో పెట్టుకుని కాపాడుతుంది, పుట్టిన తరువాత కూడా! అలాంటి మాతృమూర్తి కి ఏమిచ్చి మనం ఋణం తీర్చుకోగలము?

అయితే, ఒకప్పుడు తల్లులు, ఆలనా పాలనతో పాటు మంచి చెడు నేర్పించడం, అమ్మాయిలయితే ఇంటిపని, అబ్బాయిలైతే నాన్నకి తోడుగా ఉండి సహాయం చెయ్యి అని చెప్పడం చేసేవారు. మారుతున్న కాలంలో ఇలాంటివి తక్కువైయ్యాయి. ఉద్యోగం వత్తిడి వల్ల, వాళ్ళకి చెప్పే బదులు మనమే చేసుకుంటే పని త్వరగా అయిపోతుందని లేక, వాళ్ళు చాల చదువుకుంటున్నారు, వాళ్ళని ఇబ్బంది పెట్టడం ఎందుకు అని అనుకుని వాళ్ళకి పని చెప్పడం మానేసారు. మరొక వర్గం వారు మేము పడ్డ కష్టాలు మా పిల్లలు పడకూడదని వారిని అపురూపంగా పెంచుతున్నారు. ఇందువల్ల ఇప్పటి పిల్లల్లో ఇదివరకున్న క్రమ శిక్షణ, ప్రేమ, పెద్దల పట్ల గౌరవము, పేదల పట్ల సానుభూతి తక్కువయ్యి, మేమే చాల గొప్ప అన్న ఆలోచన ఎక్కువైయ్యింది. ఇప్పటికాలం పెంపకంలో మార్పులు చేరి దాని పర్యవసానం నేటి పిల్లలు సంకుచితంగా ఆలోచించడం, స్వార్థం ఎక్కువవ్వడం మనం చూస్తూ ఉన్నాం. వారికి ఆత్మ బలాన్ని ఇస్తున్నారు కాని పదుగురిలో కలిసిపోయే మంచితనాన్ని పెంచటం లేదు. ఒక మంచిలక్షణమైన, చెడులక్షణమైన, ఇంటినుండే మొదలవుతుంది. పిల్లలు పెద్దవాళ్ళని అనుసరిస్తారు. పుట్టినప్పటినుండి మనం వారి మనసుల్లో వేసే పునాది బట్టే వారు వ్యవహరిస్తారు. అందులో తల్లి పంచనే ఎక్కువగా ఉంటారు కాబట్టే తల్లిదే అతి పెద్ద బాధ్యత. ఎంత ప్రేమనిచ్చినా క్రమం తప్పినప్పుడు శిక్షించాలి కూడా!

కాలానుగుణంగా ఈనాడు, అమ్మాయిలకైనా అబ్బాయిలకైనా బరువు బాధ్యతలు, ఓర్పు సహనం, పెద్ద చిన్న తారతమ్యము మొదలైనవి నేర్పించే అవసరం ప్రతి తల్లికి ఉంది. మనం గమనిస్తే, మంచి విలువలతో పెరిగిన ఇంటిలోనే అనురాగం ఎక్కువ ఉంటుంది. ఇంటిలో ఏ గదిలోనైన అందరూ కూర్చుని కలివిడిగా మాట్లాడటం చూస్తాము. ఇంటిలో జరిగే ప్రతి పండగ కోసం ఎదురుచూడటం ఎక్కువగా ఉంటుంది. ఈ ఇళ్ళల్లో మొక్కుబడిగా, యాంత్రికంగా ఏ విశేషం జరగదు. అలాంటి ఇళ్ళకి వెళ్ళాలంటే మన మనసు ఉవ్విళ్లూరుతుంది. అదే ఆ ఇంటి అమ్మ ప్రత్యేకత.

తనలో నుండి వచ్చిన రూపం, తన చిటికిన వ్రేలుని పట్టుకుని పెరిగిన పిల్లలు, ఒక చిన్న కానుక తీసుకొచ్చిస్తే, ఆ తల్లికి కలిగే ఆనందం ఇంతా అంతా కాదు. అయితే, అమ్మకి వస్తురూపకంగా ఇచ్చే కానుకల ద్వారా కొంత వరకే మన ప్రేమని వ్యక్తం చెయ్యగలము. తను నేర్పిన మంచి బుద్ధులతో ప్రయోజకులై పది మంది పొగిడినప్పుడు, తన కంటిలో మెరిసే తళ తళ, గుండెలో ఒక చిన్న పాటి గర్వమే ఆ మాతృమూర్తికి మనమిచ్చే నిజమైన కానుక. ఈ అంతరార్థము తెలుసుకున్న పిల్లలు, వారి తల్లులు ఒకరి నుండి ఒకరు ఎక్కువగా ఆశించరు అనడంలో అతిశయోక్తి లేదనుకుంటా!

**మాతృదినోత్సవ శుభాకాంక్షలు !!!!**

## మారుతున్న కాలంతో పాటు మారుతున్న తండ్రి!

**పితృదినోత్సవ శుభాకాంక్షలు!**

అమ్మాయిలకి తండ్రి పోలిక, అబ్బాయిలకి తల్లి పోలిక వొస్తే అదృష్టం అంటారు. ఎందుకంటే, సహజమైన సున్నితత్వంతో పుట్టే ఆడపిల్లలకి తండ్రి సామర్థ్యం, సహజమైన ధైర్యలక్షణం, ఒనకూరుతుందని, అదేవిధంగా సహజమైన మొరటు తనంతో ఉండే అబ్బాయిలకి తల్లి సున్నితత్వము వల్ల మంచి వ్యక్తిత్వం ఏర్పడుతుందని మన పెద్దవాళ్ళు చెబుతారు. నాకు తెలిసిన ఒక స్నేహితురాలు మాటల సందర్భంలో, వాళ్ళ అమ్మాయికి తండ్రి పోలికలు ఉన్నాయని, ఉద్యోగ రీత్యా తరచూ ఆయన ఊళ్ళు తిరుగుతూ ఉంటారని కనుక తను వాళ్ళ అమ్మాయి ముఖంలో తన భర్తను చూసుకుంటాను అని చెప్పింది. ఎంత గొప్ప భావం కదా? అని నాకు అనిపించింది.

గతంలో తండ్రిది ఉద్యోగ బాధ్యత, తల్లిది ఇల్లు, పిల్లల బాధ్యత అనేవారు. అయితే కాలానుగుణంగా వొచ్చిన మార్పులతో భార్యాభర్తలు ఇద్దరూ సమానమైన పాత్రలు వహిస్తున్నారు పిల్లల పెంపకంలో. ఇది ఎక్కువగా మన దేశం కంటే ఇతర దేశాల్లో చూస్తాము. మన వాళ్ళలో కూడా చాలా మార్పులు వొచ్చాయి. కొందరి ఇళ్ళలో తండ్రే ఎక్కువగా పిల్లల విషయాలలో శ్రద్ధ తీసుకోవడం మనం చూస్తూ వుంటాము. గతంలో నాన్నగారిని అడగాలంటే అమ్మతో సిఫారసు చెయ్యాల్సి వొచ్చేది. ఇప్పటి కాలం పిల్లలు తండ్రితో కూడా ఎంతో

చనువుగా ఉండగలుగుతున్నారు. ఇది మంచి మార్పు. ఎందుకంటే, తల్లితండ్రుల పట్ల చనువుతో పాటు గౌరవం కూడా ఉన్న పిల్లలు చెడు మార్గంలో వెళ్ళే అవకాశం దాదాపు లేనట్లే. భార్యాభర్తలు ఒకరిని ఒకరు గౌరవించే ఇంటిలో పిల్లలు తండ్రి పట్ల కానీ, తల్లి పట్ల కానీ అమర్యాదగా ప్రవర్తిస్తే, వెంటనే వెళ్లి నాన్నగారి దగ్గర క్షమార్పణ తీసుకో, అమ్మ దగ్గర క్షమార్పణ తీసుకో అని అంటూ ఉంటారు. ఈ అన్యోన్యత చూసిన ఆడపిల్లలు నాకు మా నాన్నగారి లక్షణాలు కల భర్త రావాలని కోరుకోవడం, మా అమ్మలాంటి భార్య రావాలని మగపిల్లలు కోరుకోవడం కూడా సహజం. ఇటువంటి సభ్యత కల ప్రతి కుటుంబం సమాజానికి పునాది రాయి వంటిది.

భార్యాభర్తలని పొలం దున్నే రెండు ఎడ్ల తో పోల్చేవారు. అందులో ఏ ఎద్దు వొరిగినా దున్నడం కష్టం. అలాగే భార్యాభర్తల్లో ఏ ఒక్కరి ఉనికి ఎక్కువైనా, తక్కువైనా, పిల్లల మీద చాలా ప్రభావం కనబడుతుంది. అయితే యంత్ర పరికరాలు వచ్చిన తరువాత ఇప్పటి తరంలో పొలం దున్నడం, రెండు ఎద్లు అనే ఉపమానానికి అర్థం పోయిందనుకుంటా! పిల్లలు తల్లితో చనువుగా ఉంటే తండ్రికి అసూయ, తండ్రి తో చనువుగా ఉంటే తల్లికి అసూయ అనే పోకడలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక ఇలా పెరిగిన పిల్లల్లో మంచి లక్షణాలు ఎలా వొస్తాయి చెప్పండి?

పోలికల విషయానికి వొస్తే వీడు నాలాగా ఉన్నాడు కాబట్టి నేను అన్ని అమర్చుతాను, వాడు వాళ్ళ అమ్మలాగా ఉన్నాడు కాబట్టి నా కసి అంతా వాడి మీద తీర్చుకుంటాను అన్న మనస్తత్వం ఎక్కువగా కనిపిస్తుంది ఈనాటి తరంలో. ఇది ఎంతవరకు న్యాయం?

తల్లి ప్రేమనే ఇవ్వగలదు. కానీ తండ్రి ధైర్యాన్ని కూడా ఇవ్వగలడు. పిల్లలు సాహసవంతులు కావడానికి తండ్రి పాత్ర చాలా ఉంటుంది. చిన్నప్పుడు తల్లి చెంగుని పట్టుకుని తిరిగిన మగపిల్లలు యుక్తవయస్సు రాగానే తండ్రిని అనుసరిస్తారు. చిన్నప్పుడు తండ్రితో చనువుగా ఉన్న ఆడపిల్లలు పెద్దవగానే తల్లిని అనుసరిస్తారు. అది ప్రకృతి సహజం అనుకుంటా! ప్రకృతి సహజంగా జరిగే మార్పుల పై అవగాహన, ఓర్పు కోల్పోయి, అసహనంతో కృత్రిమమైన సంప్రదాయాలు తేవాలని ప్రయత్నిస్తూ ప్రతి కుటుంబాన్ని కల్లోలం, కలుషితం చేస్తున్నారు.

www.sirimalle.com

పిల్లలు అనుసరించాలంటే  తండ్రి అనే వ్యక్తి ఎంతో సమర్ధుడై ఉండాలి? ఒక ప్రక్కన కఠినంగా ఉంటూ, మరొక ప్రక్క ప్రతి విషయంలో వారి చర్యలని గమనిస్తూ, వారిని పరిరక్షిస్తూ వుంటే పిల్లలకి కొండంత ధైర్యం ఉంటుంది. ఎదిగిన కొడుకు చేతికి అంది వచ్చేంతవరకు తండ్రి పడ్డ కష్టాన్ని చూస్తే, నిస్వార్ధంతో ఆయన చేసిన కృషిని గమనిస్తే, ఏ కొడుకు తండ్రిని పూలలో పెట్టుకుని చూడడూ? మొట్ట మొదటిసారి కొడుకు, 'నాన్నగారు మీకోసం' అని ఒక చిన్న బహుమతి ఇచ్చినప్పుడు ఎంత గర్వంగా ఉంటుంది? నేను సరిగ్గా పెంచానని తండ్రికి అప్పుడు ఎంతో ఆత్మసంతృప్తి కలుగుతుంది.

కానీ, ఇటీవల రెండు రకాలైన వ్యవహారాలను చూస్తున్నాము. అడిగినదల్లా ఇస్తూవుంటే, ఎవడి కోసం చేస్తాడని కొడుకు, వీడు పెరిగి పెద్ద అయ్యి నా మొహం చూస్తాడా అని, వాడు పడే కష్టాలు వాడు పడనీ అని తండ్రి.  కానీ ఒక్కనాడు కూడా ఈ రెండు రకాలు అర్ధం చేసుకోనిది పిల్లల్ని మేము పెంచే విధానం లో తప్పుందని. పెంచే బాధ్యతతో పాటు, నా కొడుకు, నా తండ్రి, అన్న బంధానికి నమ్మకం అనే గట్టి పునాది వెయ్యాలి, అన్న విషయాన్ని  పూర్తిగా మర్చిపోయారు.;

ఇంకో రకం కూడా ఉంది. ఒక వయస్సు వచ్చిన తరువాత, మీకేమి తెలియదు అనే పిల్లలు, మా వాడు చాలా గొప్పవాడు అని లేనివీ ఉన్నవీ చెప్పే తల్లిదండ్రులు. ఈ రకం ఎక్కువగా మనదేశం కంటే ఇతర దేశాలలో చూస్తూ వుంటాము. కారణం; బహుశా! మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం కావచ్చు.

పిల్లల్ని పెంచేటప్పుడు వ్యాపారరీత్యా ఆలోచించకుండా, నాకు ఏమి ఇచ్చినా ఇవ్వక పోయినా, వాళ్ళు మరొకరి మీద ఆధార పడకూడదని, వారి చెడు ప్రవర్తన భూమికి భారం కాకూడదని నిస్వార్ధంగా ఆలోచిస్తే, ఈ భూమి మీద మంచి పిల్లలకి కొదవ ఉండదు.;

"పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహం నాడు పొందును" అన్న సుమతి సూక్తిని ఎంత మంది అర్ధం చేసుకుంటున్నారో నాకు అనుమానమే. ఎందుకంటే ఇక్కడ కూడా, చిన్న చిన్న విజయాలకే మా వాడి కంటే గొప్పవాడు ఈ భూప్రపంచంలోనే లేడని, తన కొడుక్కి దక్కాల్సింది దక్కలేదని, అందరిని ఆడి పోసుకుంటున్న తల్లితండ్రులు ఒక వైపైతే, నాకంటే నా కొడుకు నీతిమంతుడు, సమర్ధుడు అని ఒప్పుకోవడానికి నామోషిపడే తల్లితండ్రులు, వారి అహంతో పిల్లల్ని మెచ్చుకోలేని దుస్తితిలో కూడా ఉన్నారు.

ఆ సుమతి పంక్తులని అర్థం చేసుకొని, తగు సందర్భాలలో పిల్లలని మెచ్చుకున్న ప్రతి తండ్రీ, తన పిల్లలకు అదర్శప్రాయుడైయ్యాడు.

తండ్రి ఎప్పుడూ తండ్రే. సమాజంలో ఎలాంటి మార్పు వచ్చినా తను నిర్వర్తించ వలసినది నిర్వర్తించాలి. పిల్లల కడుపు మాడ్చి, తనని ఎవరు చూస్తారు వృద్ధాప్యంలో అని దాచుకుంటే, ఏమి సందేశం ఇస్తున్నాడు పిల్లలకి? ఇది చూసిన పిల్లలు అలాగే వాళ్ళ పిల్లల విషయంలో కూడా ప్రవర్తిస్తారు. అంతే కాదు, నువ్వు మాకు అవసరమైనప్పుడు ఖర్చు పెట్టలేదు, నిన్ను మేమెందుకు చూడాలి అని అంటారు కూడా?

ఏది ఏమైనా, ఇదివరకు లాగ పిల్లల గురించి పాటుపడే తండ్రులు, తండ్రిని గౌరవించే పిల్లలు తక్కువయ్యారు. ఎవరిదారి వారు చూసుకోవడం అవసరమని స్వార్థంగా ఆలోచిస్తున్నారు. మన భారతీయ సంస్కృతి మీద పాశ్చాత్య సంస్కృతి ప్రభావం బాగా కనిపిస్తుంది. సంప్రదాయంలో వాతలు పెట్టుకున్నారు. కానీ, నిజమైన లోతుని అర్థం చేసుకోలేదు కొందరు తండ్రులు. అది చాల బాధాకరమైన విషయం.

ఇక ఇలాంటి వ్యవస్థ పెరిగిపోతుంటే కుటుంబం అనే మాటకి అర్థం త్వరలో మారి పోతుందేమో? ఇందుకు మనం మన వంతుగా ఏమి చెయ్యాలి?

## చలన చిత్ర ప్రపంచం నాడు-నేడు మనని పరిపాలిస్తున్న విధానం!

1970 వరకు:

చలన చిత్రాల పుట్టుక మొట్ట మొదట విప్లవాత్మక సందేశాలతో మొదలయ్యింది నాకు తెలిసి. నేను మన భారత దేశాన్ని గురించి మాట్లాడుతున్నాను. ఆంగ్ల దేశపు పరిపాలనలో స్వరాజ్యం కోసం పోరాడిన మన ప్రతినిధుల సందేశాల్ని ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకి తెలియబరుస్తూ, ఉత్తేజులని చేస్తూ , ప్రజల్లో మార్పు తెస్తూ, ఒక మంచి కార్యాన్ని చేబట్టింది. అప్పటి దర్శకులకి కూడా ఆలోచన ఒక్కటే. చలన చిత్ర పరిశ్రమ ఒక వ్యాపారంలా ఆలోచించలేదు.

స్వరాజ్యం వచ్చిన తరువాత కొంతకాలం కొనసాగింది మన నాయకుల ఎలా పోరాడారు అని. అది ఒక ప్రక్క అయితే, అప్పటి మనుషుల్లో దేవుడు అనే వాడు ఉన్నాడు, భగవంతుడు దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేస్తాడు

అన్న నమ్మకం ఉండేది. అందువల్ల ఆ కోణంలో కూడా ఎక్కువగా కథా రచన చేసేవారు. సాంకేతికంగ ఈనాటంత అభివృద్ధి లేక పోయిన, 'అబ్బా! ఇది నిజమా! ఎంత అద్భుతంగా ఉంది!' అని ఈనాటికి కూడా చిరస్థాయిగా నిలిచిపోయిన పలు పురాణాత్మక కధలు, భూకైలాస్, మాయాబజార్, పాండవ వనవాసం మొదలైనవి ప్రతీకలు.

మూడు గంటలైనా, తెలిసిన కథైనా ఓపికగా చూసి, నవ్వే దగ్గర నవ్వి, ఏడ్చేదగ్గర ఏడ్చి, విఠలాచార్యుడి మాయమంత్రతంత్రాలని సినిమాలో ఎంత గొప్పగా చూపించాడు, అని మెచ్చుకుని, అందులోని పాటలు రేడియోలో ఎప్పుడు వస్తాయా, అని ఎదురుచూస్తూ, ఎక్కడో పెళ్లిల్లో, ఎల్. పి. రికార్డ్ లో వొస్తున్నప్పుడు, చిన్న పెద్ద అందరూ లౌడుస్పీకర్ ముందు నిల్చుని వింటున్న నా చిన్ననాటి ప్రపంచం ఇప్పటికి కళ్ళకు కట్టినట్టుగా ఉంది.

ఆ తరువాత చాలా కాలం రాజులు, వారి కుటుంబాలని ఆధారం చేసుకొని జానపద చలన చిత్రాలు వచ్చాయి. అయితే ఇక్కడకూడా దేవుడిని ఎవ్వరు మర్చిపోలేదు. కొంత సాంఘీక జీవనం కొంత పురాణపురుషులు, యక్షులు, కిన్నరులతో మిళితమైన కధలు, ఎంతో ఆసక్తి కరంగా, సరదాగా ఉండేవి. సరే అప్పటి ఫైట్స్ ఇప్పుడు చూస్తే కృత్రిమంగా అనిపించొచ్చు. కానీ నిజాన్ని గమనిస్తే, అసలు మనిషన్నవాడు ఈనాటిలాగా యుద్ధం చేస్తాడా ఎక్కడన్నా?

మరికొన్ని సంవత్సరాల తరువాత ఈ జానపద గాథలు కూడా తక్కువై, యజమానులు, అగ్రకులం ఆధారంగా తీసుకొని, రెండు కుటుంబాల మధ్య వచ్చే భేదాలు, వాటి పర్యవసానం తద్వారా ఏర్పడే అగచాట్లు చూపిస్తూ నెమ్మదిగా వాస్తవానికి దగ్గరగా వున్న సాంఘిక ఇతివృత్తంతో చిత్రాలు తీయడం మొదలుపెట్టారు. ఈ నైజం కూడా బాగుంది. ఇందులో ఒక పెద్ద కుటుంబం, ఉమ్మడి కుటుంబం, ప్రేమ ఆప్యాయతలు, ఈర్ష్య, అసూయతలు, కక్షలు, ఆవేశాలు, తదితర ముఖ్య అంశాలు చోటుచేసుకున్నాయి. అయితే, ప్రేమన్నది ఒక కథానాయిక, నాయకుడి మధ్య మాత్రమే కాకుండా, ఇంటిల్లిపాది ఒకరినొకరు ఎంతలా ఇష్టపడతారు, అలాగే ఇంటి పెద్దకి ఎంత ప్రాముఖ్యత ఇస్తారు అని చూపిస్తూ, ఇంటిల్లి పాది కలిసి పూజలు చెయ్యడం, తదితర అంశాలు చూపించారు. ఇక్కడ బహుముఖ కుటుంబ విలువలను చక్కగా పొందుపరచారు. చిన్న, పెద్ద,

మంచి, చెడు ప్రధాన అంశాలుగా ఉండేవి. గమనించాల్సిందేమిటంటే, నాయకి నాడు శారీరకంగా అబల అయినా, నాయకుడి తో సరి సమానమైన పాత్రనిచ్చి, ప్రేక్షకులని ఆకట్టుకునే వారు.

చిత్రం నిడివి మూడు గంటలైనా చూస్తుంటే మనింట్లో జరిగే సామాన్యమైన సంభాషణలు గుర్తుకొస్తాయి. పాత్రధారులు వారి సొంత గొంతుతోనే సంభాషించేవారు. వేరే భాష వాళ్ళు కూడా కష్టపడి ఏ భాషలో చిత్రం నిర్మిస్తే ఆ భాషను నేర్చుకొని నటించేవారు. కొన్ని చిత్రాల్లో కుటుంబం ముఖ్య అంశం అయితే, కొన్ని నాయకుడు ప్రధాన అంశంతో, కొన్ని నాయకి ప్రధాన అంశంతో తీసేవారు. అలాగే చిన్న పిల్లలని కూడా ముఖ్య తారాగణంగా తీసిన చిత్రాలు కూడా లేకపోలేదు. ఉదాహరణకు భక్త ప్రహ్లాద, వెలుగు నీడలు, బాలరాజు కధ, పాపం పసివాడు మొదలైనవి ఎన్నో. కధకు కధకు, ఒక పాత్రకి ఇంకో పాత్రకి ఎంతో వైవిధ్యం చూపిస్తూ, నటీనటులు తమ సహజ నటనతో తమ ప్రతిభని చాటుకునే వారు. పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వించే రేలంగి, రమణ రెడ్డి గార్ల హాస్యం మనం మరువగలమా? పాట వింటే మనకి అందులోని నటులు అనాలోచితంగా గుర్తొస్తారు. కధానాయకుడు, నాయకిల మధ్య స్వచ్ఛమైన ప్రేమను చూపించిన అద్భుతమైన ప్రేమ కథా చిత్రాలు దేవదాసు, ఆరాధన. తల్లిదండ్రులని గౌరవిస్తూ వారి ఆలోచనలో మార్పు ఎలా తేవాలి అన్న తాపత్రయం కల పలు చిత్రాలను కూడా మనం చూశాము.

నాటి చిత్రాలన్నీ సకుటుంబ సమేతంగా వెళ్లి చూడగలిగినవే. ఎక్కడా కూడా ఎబ్బెట్టుగా, ఇబ్బందికరంగా అనిపించేది కాదు. సున్నితమైన హాస్యం. సున్నితమైన పదజాలం. భావోద్వేకమైన మనుషుల మనస్తత్వం ఎక్కువగా కనిపించేది. అశ్లీలతకు తావు లేదు. ఉదాహరణకి, ఒక చిత్రంలో చరమాంకంలో వున్న నాస్తికురాలైన భార్యతో 'నారాయణ' అని చెప్పించటానికి భర్త పడే ప్రయత్నం. నారని చూపించి 'నారా ' అనమంటే 'పీచు' అంటుంది కానీ 'నారా' అనదు. చూసారా! ఇలా నాటి ఒక్కో చిత్రం ఒక ఆణిముత్యం. ఇలా వర్ణించుకుంటూ పోతే, ఈ ప్రవాహం అప్రహితంగా కొనసాగుతుంది.

మంచి కథాంశాల కూర్పుతో, సందేశాత్మక కుటుంబవిలువలతో వస్తున్న చిత్రాల నుండి నెమ్మదిగా చిత్రపరిశ్రమ ఒక వ్యాపారంగా మారడం మొదలైంది. ఇది ఒకరకంగా మంచిదే. ఎందుకంటే ఎంతో మంది కళాకారులకి ఆశ్రయం దొరికింది. జీవనోపాధి లభించింది. అయితే, సినిమాతీస్తే చాలు ఒక్కసారిగా ఎంతో లాభం కలుగుతుంది అన్న ఆలోచన పెట్టుబడిదారులని కూడా ఆకర్షించింది. తద్వారా కధకి ప్రాముఖ్యత

ఇవ్వకుండా, ఒక మంచి హీరో ఉంటే చాలు మా సినిమా 100 రోజులు ఖచ్చితంగా ఆడుతుందనే అజ్ఞానంలో పడి ఆస్తులు కోల్పోయిన అభాగ్యులు ఎంతో మంది ఉన్నారు. అలాగే, మంచి కథ ఉండి కూడా దానికి సరిపోయే కథానాయకుడిని పెట్టుకునే స్తోమత, అవగాహన లేక పెట్టిన పెట్టుబడి రాక నష్టపోయిన నిర్మాతలు కూడా ఉన్నారు. ఉదాహరణకు ప్రముఖ హాస్యనటుడు రాజబాబు తీసిన 'మనిషి రోడ్డున పడ్డాడు' సినిమా నిజంగానే అతనిని రోడ్డున పడేసింది.

అయితే, ఇలాంటి కోవలోనే వున్న 'ముత్యాలముగ్గు', 'శంకరాభరణం' వంటి సినిమాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. ముత్యాల ముగ్గు అన్న పేరుకి జనాలు ఎలా స్పందిస్తారో అన్న భయంతో ఒక దేవుని బొమ్మ వున్న గొలుసు బహుమతి గా ఇస్తూ ప్రేక్షకులను థియేటర్లకు ఆహ్వానించిన మొట్టమొదటి సినిమా. ఈ చిత్రంలోని ప్రతినాయకుడు శ్రీ రావు గోపాలరావు, అదేవిధంగా శంకరాభరణంలో శంకర శాస్త్రి పాత్రను పోషించిన శ్రీ సోమయాజులు ఈనాటికీ మన మనస్సులో సజీవంగా ఉన్నారు. ఒక చిత్రానికి ప్రజాదరణ కావాలంటే పేరుపడిన కథానాయకుడు అవసరంలేదు, కథాంశం పటిష్టంగా వుంటే చాలు అని నిరూపించాయి ఇటువంటి చిత్రాలు. ఇది చిత్ర పరిశ్రమలో కలిగిన సరికొత్త మార్పు. ఈ అంశాన్ని అర్థం చేసుకున్న కొద్దీ నిర్మాతలు మళ్ళీ కథ, సంగీతం తదితర విషయాలకి ప్రాధాన్యతనిస్తూ మరికొన్ని ఆణిముత్యాలని మనకి అందించారు. పేరుతెచ్చుకున్న చిత్రాలన్నింటిలో ఎంతో కొంత వైవిధ్యాన్ని చూపించారు. సాగర సంగమం, సిరివెన్నెల, స్వాతి ముత్యం ఇత్యాది చిత్రాలు నిర్మించి మనకి ఎంతో దగ్గరయిన దర్శకుడు, కళాతపస్వి కె. విశ్వనాధ్ గారు. ఆయన సినిమా వస్తుందంటే మనందరిలో ఒక విధమైన ఉత్సుకత మొదలవుతుంది. అది ఆయన చిత్రాలు మన మనసులను ఆకట్టుకొన్న విధానం.

ఇక 1975 నుండి వచ్చిన మార్పులు గమనిస్తే, కొత్త ముఖాలు పరిచయమయ్యాయి, కథానాయికలకు కూడా సరి సమానమైన పాత్రలు ఇచ్చి వారు కూడా ఏ విధంగాను నటనలో తక్కువకాదని చూపిస్తూ వచ్చారు. కేవలం కథానాయికా ప్రధానమైన సినిమాలు 'అంతులేని కథ', 'ఇది కథ కాదు', 'చిల్లరి కొట్టు చిట్టెమ్మ', 'పొట్టేలు పున్నమ్మ' ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఆది మనం మరచిపోలేము. ఈ మార్పు వచ్చిన తరువాత, ఎంతో పేరున్న కథానాయకుల సినిమాలు కూడా అభిమాన సంఘాలు 100 రోజులు నడిపించాలని ప్రయత్నించినప్పటికీ, ఎక్కువ కాలం నిలువలేదు.

ఇక సహాయపాత్రలు తీసుకుంటే  కొంత వైవిధ్యమైన పాత్రలతో, తన హాస్యంతో అందరినీ నవ్వించిన వ్యక్తి అల్లురామలింగయ్య. 'ముత్యాలు వస్తావా' అన్న పాట బహుశా సహాయ కళాకారుడికి ఇచ్చిన ఒక మంచి ఆఖరి పాట అనుకుంటా!  రేలంగి, పద్మనాభం, రాజబాబు మొదలైనవారికి  సమకాలీనుడు అయినను ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది మాత్రం 1970 దశకం నుండి మాత్రమే. అల్లురామలింగయ్య గారు తన కంటూ ఒక హావభావాన్ని సొంతం చేసుకొని మరి ఏ ఇతర నటుడు అనుకరించలేని విధంగా మలుచుకొన్నాడు. అందుకే నేటికీ నలుగురు కూర్చుని మాట్లాడినప్పుడు ఈయనని తప్పకుండా గుర్తుకి తెచ్చుకుంటాము.

ఇక మన సినిమాలలో హాస్యం యొక్క స్థానం విషయానికొస్తే 1950 మరియు 1960 చిత్రాలలో హాస్యం అన్నది ప్రతిపాత్రలోను తొణికిసలాడేది. అందుకే హాస్యం కూడా కథకు అనుగుణంగా ఇమిడిపోయేది. ఆ తరువాత హాస్యం మోతాదు పెరిగినప్పటికీ కథకి ఏమాత్రం సంబంధం లేని సన్నివేశాలతో కేవలం ఆ హాస్యనటుని కోసం ఆ పాత్రను సృష్టించినట్లనిపించింది.

అలాగే, కొంచెం వికృతమైన ఆలోచన ఎవరికీ ఎప్పుడు వొచ్చిందో కానీ సమయం సందర్భం లేకుండా, జ్యోతి లక్ష్మి, జయమాలిని వంటి వారితో రంభ, ఊర్వశి, మేనకల ఇంద్రసభను మరిపిస్తూ ఒక సన్నివేశాన్ని సృష్టించి,  ప్రతి సినిమాలో ఒక నృత్యం పెట్టడం మొదలు పెట్టారు. నృత్యం వరకు అయితే పరవాలేదు అందులో అశ్లీలత చోటుచేసుకుంటే ఇక నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చినట్లే. చిట్టి పొట్టి వస్త్రధారణతో అసభ్యకరమైన డాన్స్ చేయించి, దర్శక నిర్మాతలు డబ్బులు సంపాదిస్తున్నారేమో కానీ కుటుంబం మొత్తం వెళ్లి చూడలేని పరిస్థితులు కల్పించారు. ఈ పర్యవసానికి కారణం బహుశా కథలో పట్టు లేక ప్రేక్షకుల మెప్పు కొరకు ఇటువంటి పై పై పూతలు పూయడం నేర్చుకొన్నారు.

పౌరాణిక చిత్రాలలో ఉన్న రంభ ఊర్వశిల పాత్రలకి సరి కొత్త రూపు అనుకొన్నారేమో కొత్త దర్శకులు. అయితే నాడు శాస్త్రీయ సంప్రదాయం మీద ఉన్న గౌరవానికి అద్దం పట్టిన ఆ నృత్యాలెక్కడ, ఈ నృత్యాలెక్కడ? అలాగే సంగీత పరంగా కూడా శంకరాభరణంలో శంకరశాస్త్రి అన్నట్టు, పాశ్చాత్య సంగీత పెను తుఫానుకి రెపరెప లాడుతున్న నేటి సంగీతానికి,  నాటి సత్ సంప్రదాయం కల సంగీతానికి  పొంతన ఎక్కడ?  కొత్త ప్రయత్నాలు కొత్త పద్దతులు అని వారు మనకి అందిస్తూ ఉంటే మనం కూడా తలూపుతూ వాటిని ఆమోదిస్తున్నాము.

సమాజం ఎప్పుడు ముందంజ వెయ్యడం అవసరము. అంతమాత్రాన మనని మనమే మర్చిపోయేలా మారిపోతున్న ఈ సమాజానికి కళ్ళాలెయ్యడం కూడా అవసరం.

సరే, ఇక 1980 మరియు 1990 దశకాలు చూద్దాం. నాయకీమణి అవసరం చాల తగ్గిపోయింది. కధానాయకుడి మీద ఆధారపడిన కథలే ఎక్కువగా ఉన్నాయి. మాస్ హీరోగా మొట్ట మొదటి సారిగా మనకి పరిచయమైన చిరంజీవి దాదాపు 150 చిత్రాలలో పని చేసి మెగాస్టార్ చిరంజీవిగా ప్రసిద్ధికెక్కడం మనందరికీ తెలుసు. ఆయన వచ్చిన తరువాత అభిమాన సంఘాల సంఖ్య కూడా బాగా పెరిగిపోయింది. సరే, అది ప్రక్కన పెడదాం. సినీ పరిశ్రమ చిరంజీవికి ఉన్న నటనా, నృత్య కౌశల్యాన్ని ఒక మంచి పద్ధతిలో వాడుకుంటే బాగుండేది. కానీ వ్యాపారంగా మారిన నేటి ప్రరిశ్రమ ఆయన నాట్య పటిమని ఎక్కువగా పాశ్చాత్య పద్ధతిలో మలచి, పాట కున్న భావానికంటే ఆయనవేసే అడుగులకి ప్రాధాన్యత ఇచ్చింది. అది ఒక మార్పయితే, అప్పటి వరకు ముష్టి యుద్ధాలు, కర్రాటలతో ఉన్న ప్రతి నాయకుడిని ఎదుర్కొనే చిత్రాలనుండి, పదిమంది రౌడీలను మన హీరో ఒక్కడే ఎదుర్కొనే సిద్ధాంతంతో చిత్రాలు రావడం మొదలుపెట్టాయి. దాంతో మాస్ హీరోఇజం అన్న ఒక సరికొత్త పదానికి నాంది పడింది. అటుపిమ్మట చిత్ర పరిశ్రమలో ఏమైందో నాకు ఇప్పటికి అర్ధం కాలేదు.

ఆయన మొదట చేసిన కొన్ని చిత్రాలు; ప్రాణం ఖరీదు, మనవూరిపాండవులు, పునాదిరాళ్ళు, ఒక మంచి సామజిక స్పృహ ఉన్న చిత్రాలు. వాటితో పోల్చుకుంటే తరువాతి చిత్రాలు ఇంద్ర, టాగోర్ లల్లో, అయన నటనని అభినందిచాలో లేక అర్ధం పర్ధం లేని క్లైమాక్స్ పోరుని చూసి తల పట్టుకోవాలో అర్ధం కాదు. ఒక్కడు ఒక 100 మందిని ఎదుర్కొని, ఏ ఆయుధము లేకుండా? పోరాటం సాగించడం అనేది ఎంత హాస్యాస్పదం? అంతే కాక ప్రతి నాయకుడు, అతని అనుచరగణం చేస్తున్న అఘాయిత్యాలు, అరాచకాలు కూడా చాల అసభ్యంగా చూపించేవారు. సమాజంలో ఎక్కడో జరుగున్న ఒకటి రెండు అసాంఘీక సంఘటనలు వెండితెర మీద నిస్సందేహంగా చూపించి, ఇంకా ప్రేరేపించినట్టు అనిపిస్తుంది. చెడ్డవాడికి కేవలం ఒక అవకాశం కావాలి, మన చిత్ర పరిశ్రమ ఆ అవకాశాన్ని సమృద్ధిగా ఇచ్చింది. వైవిధ్యమైన అరాచక కృత్యాలకు మన సినిమాలే వూతమిచ్చినట్టైనది. అదేమంటే చివరలో మన హీరోతో ఒక మంచి సందేశం ఇప్పిస్తారు. కానీ సామాన్యుల ఆలోచనలలో మంచి కన్నా చెడు ఎక్కువ ప్రభావం చూపుతుందనే విషయాన్ని మరిచారు మన చిత్ర

ప్రముఖులు. కధకి కధకి వైవిధ్యం ఉన్నప్పటికీ, చివరి సన్నివేశం ఒకటే. అందుకు కారణం మన కథా రచయితలు, దర్శకులు, నిర్మాతలు మన ఆణిముత్యాల వంటి 1950, 1960 వ దశకంలో వున్న చిత్ర స్క్రీన్ ప్లే ని పూర్తిగా మరిచారు. ఆ సినిమాలను గమనించి వుంటే పరిస్థితి ఇంత దారుణంగా వుండేది కాదేమో. అయితే, చిరంజీవి గారి కొన్ని చిత్రాలలో  కధానాయిక పాత్ర బలంగానే ఉండేది. విజయశాంతి నటించిన సినిమాలలో ఆ విషయం ప్రస్ఫుటంగా కనపడుతుంది.

ఇక 21 వ శతాబ్దం లోకి వస్తే కధానాయకి కేవలం ఒక అందంగా ఉన్న పుత్తడి బొమ్మ. ఆమె అందమైన ఆకారం మరియు ఆమె చేసే నృత్యం తప్ప నిర్మాతలకి వేరే అవసరం లేదు. ఆమెలో ఉన్న నటన కౌశల్యాన్ని బయటికి తీసుకురావడం వారి బాధ్యత కాదనుకున్నారు. సావిత్రి నాటినుండి విజయశాంతి వరకు ఎంతో మంది అద్భుతమైన తెలుగు నటీమణులున్న తెలుగు గడ్డలో, పరభాషా నటులను తీసుకు రావడం మొదలు పెట్టారు. ఆనాడు కొందరు తెలుగు చిత్రాల్లో ఇతర రాష్ట్రాల నటులు నటించినా, వారు ఎంతో ఓపికగా తెలుగు నేర్చుకుని నటించేవారు. కానీ నేడు ఒక సరి కొత్త నటీమణి రాగానే వెంటవెంటనే కాల్షీట్స్ బుక్ చేసేసి, ఆమె ఇచ్చిన కొద్ది సమయంలో త్వర త్వరగా సినిమా ముగించి వేయడం ఆనవాయితిగా మారింది. దాని పర్యవసానమే డబ్బింగ్ ఆర్టిస్ట్స్ ప్రవేశం. ఒక్కప్పుడు సౌండ్ ట్రాక్ వింటే అందులో ఎవరు మాట్లాడుతున్నారో తెలుసుకోవడం చాలా సులభంగా వుండేది. గొంతును పట్టి నటులను పోల్చుకునే అవకాశం మెండుగా వుండేది. ప్రస్తుతం దాదాపు హీరోయిన్ అందరికీ ఒకరో ఇద్దరో డబ్బింగ్ చెబుతున్నారు. కనుక మనిషిని చూస్తే తప్ప పోల్చుకోలేము. మరొక దారుణం ఏంటంటే కొన్ని చిత్రాల్లో నటీమణులు ఇద్దరు కానీ వారి గొంతు మాత్రం ఒకటే ఎందుకంటే ఇద్దరికీ ఒకే ఆర్టిస్ట్ డబ్బింగ్ చెబుతుంది. అది మన గ్రహచారం అనుకోవాలో లేక మారుతున్న కాలంతో మనం కూడా మారాలి అనుకోవాలో అర్ధంకావడం లేదు. ఇటువంటి చిత్రాలు తీయ్యడం ఎందుకు? అనే సందేహం సదా సగటు ప్రేక్షకుడికి కలుగుతున్నది. కనుకనే ఇటువంటి చిత్రాలు ఎప్పుడు రిలీజ్ అవుతున్నాయో ఎప్పుడు పోతున్నాయో కూడా తెలీడంలేదు.

ఇదే కాదు, ఒక ప్రక్క ఆడపిల్లలు అన్ని రంగాలలో పేరుతెచ్చుకుంటుంటే, అలాంటి కధలు ప్రక్కన పెట్టి, ఆడపిల్లలని ఎప్పుడూ అబలలుగా చూపించడమే ఆనవాయితి అయ్యింది. ఒక్కసారి వీళ్ళందరూ చైనా వాళ్ళు తీసే చిత్రాలు చూడాలి. అందులో ఆడపిల్లలు తమ రక్షణ కోసం కరాటే నేర్చుకోవడం, అవసరమైతే

దుండగులని ఎదుర్కోవడం చూపిస్తుంటే, మన సినిమాలలో ఎవరో హీరో వచ్చి రక్షించే వరకు అమ్మాయిలు ఎటువంటి ప్రతిఘటన చూపించకుండా భయం భయం గా చూస్తూ వుండడం చూస్తుంటే మనం ఇంకా ఏ దశకంలో వున్నాం అని సందేహం వస్తుంది. అది ఎంతో అవమానకరంగా కూడా ఉంటుంది? ప్రతి ఆడపిల్ల తనుకూడా సెల్ఫ్ డిఫెన్సు విద్యలు నేర్చుకోవాలని, తనని తాను సంరక్షించుకోవాలని అనుకునేలా ఒక మంచి నిదర్శనంగా ఉండే చిత్రాలు తీయాలి గాని, ప్రస్తుతం మన సినిమాలలో చూపిస్తున్నట్లు నాయకీమణి అంటే, క్లబ్స్ కి వెళ్ళాలి, అసభ్యంగా ఉండే దుస్తులు ఫాషన్ కోసం వేసుకోవాలని చూపిస్తూ తీయకూడదు. 1940 లో సరే, స్త్రీలు అబలలు గానే ఉన్నారు. 2016 లో కూడానా???

క్లబ్స్ లో తాగడం, డ్రగ్స్ వాడటం, అర్ధం పర్ధం లేని భాషలో మాట్లాడటం మాత్రమే చూపిస్తూ అదే నేటి పద్ధతి అంటే మంచి నడవడిక వున్న ఆడపిల్లలు కూడా సమాజంలో కలిసిపోవడానికి వాళ్ళు కూడా ఈ విధమైన అలవాట్లు చేసుకుంటున్నారు. నిజానికి, అలాంటి అలవాట్లు ఒక వర్గంలోనే ఉన్నాయి. కానీ, మంచి కుటుంబాలలో నుండి వచ్చిన ఆడపిల్లలలో ఇప్పటికీ మన సత్ సంప్రదాయం ఉందని, అలాగే మగపిల్లలు మంచి పద్ధతులున్న వారినే ఇష్టపడతారని ఏ మాత్రం చూపించటంలేదు. ఈనాటి చిత్రాలు చూస్తుంటే పెద్దలకు ఎంతో సిగ్గుచేటుగా అనిపిస్తున్నది?

ఇక భక్తి విషయానికి వస్తే, మన కథానాయకుడికి, ఇంట్లో అందరు కూర్చొని చేస్తున్న పూజ నచ్చదు. అర్ధరాత్రి వరకు స్నేహితులతో గడిపి, మిట్టమధ్యాహ్నము వేళకి గానీ నిద్ర లేవడు. ఇక పూజ ఉందంటే ప్రక్కనుండి గోడ దూకి పారిపోతాడు. అదే ఒక గుడి దగ్గర పెద్ద ఉత్సవంలో మాత్రం పాల్గొని ఏకధాటిగా మాట్లాడతాడు, పాటలు పాడతాడు, డాన్సులు చేస్తాడు. అంటే దేవుడికి కూడా మాస్ దణ్ణాలు తప్ప ఇంట్లో కుటుంబంతో చేసుకునే పూజాలు ఇష్టంలేదని చెప్పడమా? ఇదేమి విడ్డూరం?? మరి ఇలాంటి అర్ధం పర్ధం లేని అంశాలు పెట్టి తీసినప్పుడు ఆ నిర్మాత ఒక్క క్షణంసేపు ఈ అంశం పై ఆలోచిస్తే ఎంత బాగుంటుంది?

ఇక 2000 సంవత్సరం తరువాత, హింస, దౌర్జన్యం తదితర చెడు విషయాలనే ప్రధాన అంశాలుగా దాదాపు 75 శాతం సినిమాల్లో చూపిస్తున్నారు. కథానాయకుడిని మొదట పరిచయం చెయ్యడం దగ్గరనుండి, ప్రతి 15 నిముషాలకీ ఏకధాటిగా రక్తం, చేతులు తెగిపోవడం, తలలు తెగిపోవడం, ఇత్యాది భయానక దృశ్యాలతో భయంకరమైన పోరు. ఇటువంటి చిత్రాలను తీయడంలో నాయకుడు ఎవరైనను పంథా మాత్రం ఒకటే. సగటు

ప్రేక్షకుడు సినిమాకి వెళ్ళాలనుకుంది ఒక మూడు గంటలు ఆనందంగా గడపాలని, తన యాంత్రిక జీవనం నుండి కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవాలని. మరి అటువంటప్పుడు అబ్బా! ఈ సినిమా ఎప్పుడు అయిపోతుందని నీరసపడిపోయే పరిస్థితి ప్రస్తుత సినిమాల వలన కలుగుతున్నది. హింసాత్మక సంఘటనలు, జుగుప్సాకర సన్నివేశాలు లేకుండా సినిమా తీస్తే ప్రేక్షకులు ఆదరించరా? ఎందుకు ఆదరించరు. ఎటువంటి ఆర్భాటాలు లేకుండా కథా ప్రధానంగా తీసిన ఎన్ని చిన్ని సినిమాలు సూపర్ హిట్ కాలేదు.

ఇప్పటి కాలంలో పూర్తిగా పాశ్చాత్య సంప్రదాయంలో నృత్యాలను చేయిస్తున్నారు. పాడే పాటకి వేసే డాన్స్ కి సంబంధం ఉండదు. పాటకి సందర్భం కూడా ఉండదు. ఖచ్చితంగా ఐదారు పాటలు ఉండాలి కాబట్టి ఎక్కడో ఒక దగ్గర ఇరికించేస్తారు. పాటల రచనలో కూడా తెలుగు తప్ప అన్నీ భాషల వాడకం ఉంటున్నది. పాత్రల మధ్య సంభాషణ కూడా ఆంగ్లంలో ఎక్కువగా ఉంటుంది. ఇక తెలుగు సినిమాలు అని అనడం ఎందుకో? ఈ మధ్యకాలంలో పాటలకి ఇంకో కొత్త పేరు పెట్టారు 'ఐటెం సాంగ్స్' అని. ఇది దాదాపు క్లబ్ డాన్సర్స్ చేసే నృత్యాల వంటివి. ఇంతకుమునుపు ఇటువంటి పాటలకు జ్యోతిలక్ష్మి, జయమాలిని వంటి వారు నృత్యం చేసేవారు. కానీ ప్రస్తుతం హీరోయిన్లు సైతం ఇవే నృత్యాలు చేస్తున్నారు. ఎంత వింతగా ఉంది కదూ? వెర్రి వేయివిధాలు అంటే ఇదేనేమో!!

ఇకపోతే, హాస్య నటులు. ఈ మధ్యకాలంలో ఒక సినిమా కొంచెం బాగున్నది అంటే అందుకు కారణం ఆ సినిమాలో వున్న హాస్య సన్నివేశాలు, మరియు ఆ హాస్యాన్ని పండిస్తున్న హాస్యనటులు. అందునా కొంచెం సీనియర్ అయిన బ్రహ్మానందం వంటి నటుల నటన నిజంగా హాయిగా నవ్వుకునే విధంగా వుంటుంది. అయితే ఆ నటుడు పోషించిన పాత్రకి, సినిమా కథకి ఏమిటి సంబంధం అనే ఆలోచన మాత్రం రాకూడదు. ఎందుకంటే అందుకు సమాధానం దొరకదు. హాస్యనటుడు ఉండాలి అనే ఆలోచనే తప్ప వారి పాత్రలు కథలో ఇమడిపోతున్నాయా లేదా అనే విషయాన్ని మరిచిపోయి సినిమా తీస్తున్నారు.

ప్రస్తుతకాల సినిమాలు ఒక మాస్ హీరో, అందంగా వుండి, విచ్చలవిడిగా పాప్ డాన్స్ చెయ్యగల ఒక హీరోయిన్, నలుగురు హాస్య నటులు(కొన్నిట్లో ప్రతినాయకుడు కూడా హాస్యంగా నటించడం), ప్రతి 15 నిముషాలకి ఒక ఫైట్, ఒక ఐటెం సాంగ్, కథ చివరలో ఫ్యామిలీ పిక్చర్. ఇది ప్రస్తుత సినిమా నమూన. కథలో

www.sirimalle.com

పెద్ద మార్పు ఉండదు, చివరి క్లైమాక్స్ లో కూడా పెద్ద మార్పు ఉండదు. క్రియేటివిటీ అనే పదానికి అర్థం మారింది. అదేమంటే కమర్షియల్ గా సినిమా హిట్ అవ్వాలంటే ఈ మూసలోనుంచే సినిమాలు రావాలి. అందుకే సినిమా పేరు అందులో నటించే హీరోలు మారతారు కానీ సంవిధానం ఒక్కటే. ప్రతి ఒక్క హీరోకి ఒక అభిమాన సంఘం ఉంది కాబట్టి సినిమాను ఆయన పేరుమీద కొన్ని రోజులు నడిపిస్తారు.

2000 సంవత్సరం నుండి కథా నాయకుడి మీద చిత్రాలు ఎక్కువగా ఉన్నాయి కాని, నాయకీమణి మీద చిత్రాలు అసలు లేవనే చెప్పుకోవచ్చు. ఎదో అప్పుడప్పుడు రాణీ రుద్రమదేవి లాంటి పౌరాణిక చిత్రాలు వస్తున్నాయి. ఇది చాల బాధాకరమైన మార్పు.

ఇప్పుడు సినిమా రంగంలో మరొక ముఖ్య అంశం అయిన సంగీత పరంగా వచ్చిన మార్పులని చర్చిద్దాం! హార్మోనియం, ఫిడేలు, వీణ మొదలైన సాంప్రదాయ బద్ధమైన వాయిద్యాలని సమీకరించి electronic keyboard అన్న ఒక కొత్త వాయిద్యం వొచ్చింది. ప్రసిద్ధ సంగీత దర్శకులైన ఇళయరాజా లాంటి కొద్ది దర్శకులు దీనిని వాడాల్సిన విధంగా వాడి ఆణిముత్యాలైన పాటలకి స్వరకల్పన చేశారు. అది ఆయన గొప్పతనం. అయితే, అన్ని ధ్వనులు ఒక్క వాయిద్యంలోనే ఉండేసరికి  కొందరు సంగీత దర్శకులకి మిక్సింగ్ మరియు రీరికార్డింగ్ అన్న సమస్య కూడా చాలావరకు తగ్గి, మహా అయితే పది పదిహేను మంది సిబ్బందితో ఒక సినిమాకి కావలసిన సంగీతం సునాయాసంగా సమకూర్చుతున్నారు. ఒకప్పుడు ఇరవై ముప్పైకి పైగా ఉన్న వాయిద్య బృందం నేడు పదికి తగ్గిపోయింది.

తక్కువమందితో పని ముగిస్తున్నారు. కానీ అందులో ఎంత నాణ్యత ఉంది అన్నది నేటి కొన్ని పాటలు వింటే మనకే ఆ వ్యత్యాసం తెలుస్తుంది. అంటే ఈ కీబోర్డ్,  కంప్యూటర్లు వచ్చిన తరువాత చాల మంది కళాకారులూ, సాంకేతిక నిపుణులు జీవనోపాధి కోల్పోయారు. అది చాల బాధాకరమైన విషయం.

కొత్త ఒక వింత పాత ఒక రోత! ప్రతి మనిషికి ఎదో కొత్తదనం కావాలి. అలాగే మనందరం శాస్త్రీయ సంగీతానికి భిన్నంగా ఉన్న పాశ్చాత్య సంగీతానికి కొద్దిగా తలూపుతూ వచ్చాము. అయితే కొందరు సంగీత దర్శకులు ఇంకో రెండు మెట్లు దాటి, ఇదిగో మీకు ఇది నచ్చొచ్చు అని కొత్తరకమైన సంగీతాన్ని అందించారు. ఆలా 'రెండు రెళ్ళు ఆరైంది' ప్రతి దశకంలో. పర్యవసానం, నేటి స్వరకల్పన. పాశ్చాత్యం, జానపదం, శాస్త్రీయం, లలిత

సంగీతం అన్ని కాలగాపులగం చేసి ఒక కొత్త, వింత సంగీతాన్ని ఇస్తున్నారు. మరి నేటి యువత అలాంటి పాటలకే ఉవ్విళూరుతున్నారు కూడా. ఈ కాలం వాళ్ళకి నచ్చింది, "మాస్" సంగీతం. హీరో అయితే 'మాస్' కొట్టుడు కొట్టాలి, 'మాస్' పాటలు పడాలి.. ఎంత వింతగా ఉంది కదా?

ఆస్కార్ గ్రహీత A R Rehaman మొట్ట మొదటి సారిగా మనకి 'ట్రాక్' అన్న పద్ధతిని పరిచయం చేశాడు. దీనివల్ల దర్శకుడికి, గాయకులకి మధ్య సంబంధం తగ్గి పోయింది. ట్రాక్ మూలంగా హావభావాలు ప్రకటించడానికి అవకాశం తగ్గిపోయింది. ఎందుకంటే, రాగం కొంచెం ఎక్కువయినా, తక్కువయినా, ఒక చిన్న నవ్వు నవ్వినా, మీట తప్పిపోతుందనే భయంతో భావయుక్తంగా పాడే అవకాశం కోల్పోయారు నేటి తరం గాయనీగాయకులు. తబలా స్థానంలో డ్రంస్ ఉన్నప్పుడు కొన్ని రకాలైన మాటలు భావంతో అనడం కష్టం. ఒకప్పుడు ఒక పాటని రికార్డింగ్ స్టుడియోలో అందరు కలిసి సంయుక్తంగా రికార్డింగ్ చేసేవారు. అప్పడు సంగీత దర్శకులు, గాయనీ గాయకులూ, గీత రచయితలు, వాద్యకారులు అందరు ఒకరికొకరు చేయూతనిస్తూ పాటను తయారు చేసేవారు. మరి నేడు, ఎవరికి వీలైనప్పుడు వారు వచ్చి రికార్డింగ్ చేసి వెళ్ళిపోతున్నారు. కొందరు గాయకులు నేటి కంప్యూటర్ పుణ్యమా అని వారి భాగాన్ని వారు పాడి పంపుతున్నారు. ఇది నేటి ట్రెండ్ అని, సాంకేతిక పరిజ్ఞానం అన్ని విషయాలను సులభతరం చేస్తున్నాయని అనుకోవాలేమో!

అయితే 'ట్రాక్' పద్ధతి వల్ల, విదేశాలలో నివసించే మా వంటి సంగీత అభిమానులకి పాడాలనే ఆశక్తి కలగడం మొదలైంది. కానీ, దీని వల్ల ఏమి కోల్పోతున్నామో అని ఆలోచిస్తే, 'ట్రాక్' పద్ధతి మంచిది కాదనిపిస్తుంది. సంగీత కళా కారులు ఒక కుటుంబంలా ఉండే అవకాశాన్ని కోల్పోయారు. నేటి సాంకేతిక మార్పుల వల్ల చెట్టుక్కొక్కళ్ళు పుట్టక్కొక్కళ్ళు అయిపోయారు. పొట్ట పట్టుకుని పలు ప్రాంతాలనుండి వచ్చిన వాద్యకారులు ఇప్పుడిప్పుడే జీవితంలో స్థిర పడుతున్నాము అన్న సంతృప్తి చెందే లోపల ఈ కొత్త వాద్యాలు వాళ్ళ వృత్తులని డేగలా తన్నుకుపోతున్నాయి.

ఒక్కప్పుడు ఒక రచయిత, ఒక సంగీత దర్శకుడు, ఒక నిర్మాత, ఒక దర్శకుడు అందరూ కలిసి కూర్చొని చర్చించుకుని ఒక పాటకి రూపకల్పన చేసేవారు. అందుకే ఈనాటికీ ఆ పాటలు, ఎంతో భావప్రధానమై మనందరికి మనస్సులలో నిలిచిపోయాయి. మరి నేటి పాటలో? అతి కష్టం మీద ఒకటి రెండు నేటి పాటలు

www.sirimalle.com

గుర్తుంటున్నాయి. అది కూడా తాత్కాలికమే. ఈనాడు ఇంచుమించు అదే రాగం, ఇంచుమించు అదే సందర్భం, ఇక మనకి ఎక్కడ గుర్తుంటాయి, ఆ సాహిత్యం గాని, ఆ రాగాలు గాని? ఒకసారి నేటి ప్రముఖ సినీ రచయిత అనంత శ్రీరామ్, ఈనాటి ప్రపంచంలో పాటలు ఎలా వ్రాయబడతాయో వివరిస్తూ, దర్శకుడు పాట సందర్భాన్ని ఫోనులో వివరిస్తే, సంగీత దర్శకుడు ఈ మెయిల్ లో ట్రాక్ పంపిస్తే, తను తన ఇంటిలో కూర్చునే గేయరచన చేశారట. దర్శకుడు మరో గంటలో పాటను అప్రూవ్ చేసి పారితోషికం వైర్ ట్రాన్స్ఫర్ చేశారట. అదీ నేటి పాటల పుట్టుక శైలి. మరి ఈ వ్యవహారమంతా ఒక వ్యాపారం చేసినట్టు వుంది కానీ ఎక్కడా ప్రేక్షకులని దృష్టిలో పెట్టుకుని తీస్తునట్టు అనిపించటంలేదు, కదా! అంతే కాకుండా, శరవేగంలో చిత్రాలు తీస్తుంటే టికెట్లు కొనుక్కొని ప్రతి అడ్డమైన చిత్రానికి వెళ్ళడానికి సగటు మనిషికి ఎలా వీలవ్వుతుంది? నా బోటి వాళ్ళైతే ఒక నలుగురి నుండి ఈ సినిమా బాగుంది అని అంటే తప్ప థియేటర్ కి వెళ్లి చూడాలని అనుకోరు. కొద్దిరోజులు పోతే టీవీ లో వొస్తుంది, లేదా DVD వొస్తుంది అని ఆగుతాము.

శంకరాభరణంలో అన్నట్టు, లోకం అంతా స్పీడు. మరి ఈ స్పీడు ఎప్పుడు ఆగుతుందో, మనకి మరలా తిరిగి పాత పాటల ఒరవడి ఎప్పుడొస్తుందో? మంచి పాటలు మన మనసులో నిలిచిపోయే పాటలు ఎప్పుడొస్తాయో..!? సరే, నేను పాతకాలం మనిషిని కావొచ్చు. మరి ఈ కాలంలో కూడా రంగస్థలం మీద పాడాలంటే అప్పటి పాటలే ఎంపిక చేసుకుంటున్నారు కదా? అంటే జనరంజకమైన పాటలు ఇంకా పాత పాటలే అని నిరూపించడమే కదా? అంతేకాదు పాటల పోటికి పాడాలంటే అప్పటి పాటలే ఎంపిక చేసుకుంటున్నారు కదా? అంటే విజయం తెచ్చిపెట్టడం ఆ పాటలకే శక్యం అని నిరూపించడమే కదా?

ఇప్పుడు మన తెలుగు సినిమా రంగానికి పట్టిన మరో గ్రహచారం ఏంటంటే తెలుగు పాటలు పరభాషా గాయనీగాయకులతో పాడించడం. ఒక్కప్పుడు ఆశలతా వంటి వారు కూడా తమ శాయశక్తుల తెలుగు భాషకి న్యాయం చేకూర్చేలా పాటలు పాడేవారు. వారికి తమని అపహాస్యం చెయ్యకూడదు అనే భావం ఉండేది. మరీ మరీ పదాల ఉచ్చారణ చెప్పించుకుని పాడేవారట. అలాగే మనవాళ్ళు కూడా ఖచ్చితముగా నేర్పించేవారు. ఇప్పటి వాళ్ళలో ఆ ఓర్పు, అణకువ, నైపుణ్యం లేవు. మనవాళ్ళు కూడా రికార్డింగ్ స్టూడియో లో టైం స్లాట్ దొరకదేమో అన్న భయంతో, తప్పులతో పాడుతున్నను ఆమోదిస్తున్నారు. కొందరు అపశృతులతో, కొందరు వారి సహజమైన యాసతో, అలా పాడేస్తున్నారు. వినడానికి కర్ణకఠోరంగా ఉంటున్నాయి కొన్ని పాటలైతే.

ప్రతి జాతికి, ప్రతి భాషకి ఒక నిర్దిష్టమైన గుర్తింపు ఉంది. సగర్వంగా చెప్పుకోగలిగే ఆదర్శాలు ఉన్నాయి. హావ భావాలని వ్యక్తపరిచే పద్ధతి ఉంది. అందుకే ఖండాలు, దేశాలు, రాష్ట్రాలు ప్రాంతాలు అని పరిధులు గీశారు. కానీ, నేడు ఆంగ్లం అన్నది చాలా వాడుక భాష అయిపోయింది. అందుకే నేటి చిత్రాల్లో మాటల్లోనే కాదు, పాటలలో కూడా అమితంగా ఆంగ్లాన్ని వాడేస్తున్నారు. దాని పర్యవసానం నేటి యువత భాష మీద పట్టు కోల్పోవడం. తెలుగు భాషలో ఉన్న అందాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. అంతే కాదు తెలుగులో ఉన్న వ్యాకరణం, ఉచ్చారణ మీద ఏ మాత్రం అవగాహన లేదు. దానితో నోటిలో మాటలు తిరగవు. నేడు ఎంత మంది  కథానాయకులు స్వచ్ఛంగా తెలుగులో మాట్లాడగలుగుతున్నారు చెప్పండి?

మన దేశంలో మధ్య తరగతి కుటుంబాలకి, ఒక తరహా కాలక్షేపం, ఈ చిత్రాలు! ఈ చిత్రాల్లోనే వారు విహరిస్తుంటారు. హీరోలాగ ఉండాలని, హీరోయిన్ లాగ ఉండాలని చాల తాపత్రయ పడతారు కొందరు. నిర్మాతలు సినిమా జీవితం వాస్తవానికి ఎంత దగ్గరలో తీస్తారో ప్రజలకి అంత మంచిది. అందలేని ఆ కృత్రిమమైన జీవన విధానాన్ని అందుకోవాలనుకున్న యువత, తల్లితండ్రులని ఇబ్బంది పెట్టడం, పిల్లల్ని ఆ రకంగా పెంచాలని కొందరు తల్లిదండ్రులు తలకి మించిన ఖర్చులు పెట్టడం, ఎన్నో కుటుంబాలని అశాంతి పాలు చేసింది. మరి చిత్రాలు నిర్మించాలన్న పిచ్చిలో పడ్డ కొందరు నిర్మాతలకి ఎవరు చెబుతారు వాళ్ళు చేస్తున్న తప్పు?

ప్రతి ఒక్కరు చిత్రాన్ని నిర్మించాలి, పేరు తెచ్చుకోవాలి అన్న ఆత్రుత కంటే ప్రతి చిత్రం మనిషి మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోవాలనే ఆదర్శంతో తీస్తే,  సంవత్సరానికి పది పన్నెండు చిత్రాలకంటే ఎక్కవ విడుదల చెయ్యకూడదు అని నియమం పెట్టుకుంటే, తీసే ప్రతి చిత్రం ఒక కుటుంబం దృష్టిలో పెట్టుకుని, ఒక నాన్న, ఒక అమ్మ, ఒక అన్నదమ్ముడు, ఒక అప్పచెల్లెలు తో కలిసి చూడగలిగేట్టుగా తీస్తే, చిత్రాలు చాల విజయవంతం అవ్వుతాయి. ఒక చిత్రాన్ని దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ వ్యాప్తంగా విడుదల చేసి, ఒక వారంలో ఎంత సంపాదించింది అన్న సంఖ్యని తీసుకుని అదే విజయం అని ఆనంద పడుతున్న నేటి నిర్మాతలకి, విజయం అన్నది తరతరాలకి ఆ చిత్రం యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పుకోవడం అని అర్థం చేసుకోవాలి.

కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీసి పూర్తిగా నష్టపోయిన కొన్ని చిత్రాలని చూస్తే ఒక రకమైన అసహ్యం కలుగుతుంది. ఉదాహరణకి రజనికాంత్ 'రోబో' కేవలం సాంకేతికమైన విలువలున్న చిత్రం. మరి జనాలు

www.sirimalle.com

మూర్ఖులనుకుంటారో, మంచి హీరో ఉన్నాడు కాబట్టి, అటువంటి సెంటిమెంటుని అడ్డుపెట్టుకుంటారో తెలీదు కాని, ఎందుకు తీస్తారో తెలీదు. దేశంలో ఎంతోమంది బీదవాళ్ళు ఉన్నారు. అలా కోట్లు తగలేసే బదులు, బీదవాళ్ళకి సహాయం చేస్తే వాళ్ళ పేర్లు జనం కనీసం పదికాలలు  చెప్పుకుంటారు కదా!

మనం ఎంతో అనుకరిస్తున్న పాశ్చ్యాత దేశాల్లో  చిత్రరంగంలో ఒక్కొక్క యూనిట్లో ఎంతమంది పనిచేస్తున్నారో చూస్తే మనం ఆశ్చర్య పోతాము. ఎంతమందికి జీవనోపాధి ఆసరా ఇస్తుందో చూస్తే తెల్లబోతాం.  సాంకేతికంగా మనకంటే వంద మెట్లు ఎదిగిన ఆ దేశాల్లోనే అంతమందికి ఉద్యోగాలు ఇస్తుంటే, ఉన్న వాళ్ళని తీసేసి కేవలం వారి పద్ధతులని అనుకరించి, వారి వాద్యాలని కొనుక్కొని మన కళాకారుల పొట్టని కొట్టడం న్యాయమా?

ఎదగడం అన్నది అవసరం. అందులో నేడు సాంకేతికంగా ఎన్నో మార్పులు రావడంవల్ల అనవసరంగా ఇతరులమీద ఆధార పడటం అన్నది తగ్గింది. అలా అని,  అన్ని నేనే చేసుకుని అందులో వచ్చే డబ్బులు నేనే దాచుకుంటాను అని సంకుచితంగా ఆలోచించకుండా, పదిమందికి జీవనోపాధిని కల్పించి తనుకూడా పేరు తెచ్చుకుంటే ప్రతి నిర్మాత, ప్రతి సంగీత దర్శకుడు అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

ప్రస్తుతం ఉన్న ఉన్మాదానికి మంచి చిత్రాలతో అడ్డుకట్ట వెయ్యాలని ఆశిస్తూ, తద్వారా పదిమందిని పోషించగలిగే పరిశ్రమగా ఎదగాలని ఆశిస్తూ, 'చలన చిత్ర ప్రపంచం నాడు-నేడు మనని పరిపాలిస్తున్న విధానం!' అని,  చిత్రాల మీద గత ఆరునెలలుగా వ్రాస్తున్న ఈ అంశాన్ని ఈ సంచికతో ముగిస్తున్నాను.

## తిరుమలలో భక్తుల అవస్థలు - వారి ఆందోళనలు

ప్రతిసారీ ఇండియాకి వెళ్ళినప్పుడు ఆ భగవంతుడి సంకల్పమో ఏమిటో తెలియదు కానీ నాకు ఆ వేంకటేశ్వరుని దర్శించుకునే అవకాశం కలుగుతుంది. అయితే ఎంత ఉత్సాహంగా వెళ్తానో అంత ఆశాభంగం కలుగుతుంది కూడా. కారణం, అక్కడ క్రమబద్ధమైన విధానం లేకపోవడం, స్వార్థపూరిత అర్చకులు మరియు భక్తుల మీద గౌరవం లేని  స్వచ్ఛంద సంఘు కార్యకర్తలు, మొదలైన వారు ఆ దేవుడి పేరుని అడ్డంపెట్టుకుని చాలా అవినీతికి పాల్పడుతున్నారు.

www.sirimalle.com

సరే, మూడు నాలుగు దశాబ్దాల క్రితం అంతమంది భక్తులు వొచ్చేవారు కాదు. కాలక్రమేణా అందరికి తెలియడం, నమ్మకం పెరగడం, వసతులు పెరగడం, మరి ఇతరత్రా కారణాల వల్ల కూడా చాలామంది భక్తులు దర్శించుకుంటున్నారు ఆ దేవుడిని. తిరుమలలో ఉన్న ఆ దివ్యమంగళ స్వరూపానికి ఉన్న శక్తి కూడా అటువంటిది . ఒకసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అత్యద్భుతమైన, అందమైన విగ్రహం. కోరికలు తీర్చమని అడగాలని, కోరికలు తీరాయని చెప్పాలని అనుకుని బయలుదేరినా, ఆ దేవునిముందు నిలుచున్నప్పుడు 'గోవిందా గోవిందా' అని అనడం తప్ప ఇంకేమి మన మనసులో మెదలదు ఆ క్షణంలో. మరి అలాంటి తన్మయత్వాన్ని ప్రసాదించే ఆ భగవంతుడిని దగ్గరనుండి దర్శించుకునే భాగ్యాన్ని నేడు భక్తులు కోల్పోతున్నారు. కారణం విపరీతంగా ప్రబలిన అక్కడి అవినీతి విధానం.

నాలుగు దశాబ్దాల క్రితం సరాసరి దేవుడి ముందు ఐదు నిముషాల పాటు నించుని ఎటువంటి తొక్కిసలాటలు లేకుండా ఎవరు తోయకుండా ఆనందంగా, ప్రశాంతంగా దేవుడిని చూసిన రోజులకి, చేతులు గుంజి మనని నెట్టి, మనం కొంచెం మెల్లిగా నడిచేసరికి 'నడవండి నడవండి' అన్న అరుపులతో గర్భగుడి నిండిపోయి ప్రశాంతత పూర్తిగా నశించిపోయిన నేటి రోజులకి ఎంతో తేడా ఉంది. ఏదో వెలితి కనిపించింది. గుడి ద్వారం దగ్గర ఒక TTD కార్యకర్త గోవింద గోవింద అని అనడం భక్తుల చేత అనిపించాలని ప్రయత్నించడం చాల కృత్రిమంగా అనిపించింది.

రోజు రోజుకీ పెరుగుతున్న భక్తుల రద్దీ తట్టుకొనుటకు రకరకాల పద్దతులు తీసుకొస్తున్నారు. ఒకసారి ఒక రకమైన ప్రత్యేక దర్శనం వెయ్యి రూపాయలు అంటారు, ఒకటి మూడువందల రూపాయలంటారు. తీరా అక్కడ మనం ఎదురు చూస్తున్న సమయంలో ఎవరో గొప్ప మనిషి వచ్చాడని, ప్రత్యేక అభిషేకమో ఉందని అందరినీ ఆపేస్తారు. మరి ఈ టికెట్స్ పెట్టిన విధానానికి అక్కడ దేవుడి రోజువారీ పూజల సమయాలకి సంబంధం లేదనిపిస్తుంది. పోనీలే, ఇంతసేపు ఎదురు చూశాం కదా, దేవుడి దర్శనం బాగా అయితే చాలు అని అనుకుంటే అక్కడ కూడా మనకి చుక్కెదురే. ఎందుకంటే, ప్రత్యేక దర్శనం సమయం మించిపోయి, సర్వ దర్శనంలో వచ్చిన వారిని కలిపేయాలసిన అవసరం పడుతుంది. దానితో 100 మంది ప్రత్యేక దర్శనం టికెట్ తీసుకున్నవారు ఒక్కసారిగా 2000 మంది సర్వదర్శనం వారితో పోటి పడవలసివస్తుంది. పర్యవసానం కిక్కిరిసి పోయిన జనం. ఇక అక్కడ మనం నడవాల్సిన అవసరంలేదు. జనాలే మనల్ని తోసేస్తారు. చిన్న

చిన్న పిల్లల్ని, పసికందులని చేతిలో పట్టుకుని, వారు నలిగి పోతారేమో, వారు తప్పిపోతారేమో ఈ జనం తాకిడికి అని, దేవుడిని గబా గబా చూసేసి ఎప్పుడు ఆ రద్దీ నుండి క్షేమంగా బయట పడతామా అన్న ఆలోచనలో, ఇక భక్తి తత్త్వం మనలో కలుగుతుందా?

బయట క్యూలో నిల్చున్న తరువాత గుడి ద్వారం దగ్గర ఎటువంటి క్యూ లేదు. అక్కడ మొదలవుతోంది, ఈ కల్లోల విధానం. ఒకటి మాత్రం నిజం. ఇండియాలో మనుషులకి క్యూ యొక్క విలువ తెలియదు. తోసుకుని తోసుకుని వెళ్ళడమే వారి జీవిత విధానం అనుకుంట. దానికి తగినట్టు గుడిలో క్యూకి సానుకూలత కూడా లేదు. బలమైన కడ్డీలు అడ్డంగా పెట్టి గుడిలోపల కూడా క్యూ కొనసాగిస్తే కొంత ఈ సమస్య తీరచ్చు. ఇంకా ఘోరమైన విషం ఏమిటంటే, ఒకప్పుడు భక్తులు తక్కువగా ఉన్నప్పుడు ఒకే ముఖద్వారం గుడి లోపలి వెళ్ళడానికి, బయటికి తిరిగి వెళ్లిపోవడానికి సరిపోయేది. కానీ ఇప్పటి కాలంలో ఇది చాల పెద్ద సమస్య. ఎందుకంటే, దర్శనానికి వెళ్ళిన భక్తులు మళ్ళా బయటికి వెళ్ళిపోడానికి, లోపలకి వచ్చేవాళ్ళని ఒక 10-15 నిముషాలపాటు ఆపెయ్యాలి. ఇది ఎంత మాత్రం సరైన పద్దతి కాదు. ఇందువల్లే రద్దీగా కనిపిస్తుంది. క్యూ పద్దతి పెట్టి, ముఖద్వారం దగ్గర వచ్చి పోయేవారికి అడ్డుకట్ట పెడితే సమస్య కొంత తీరుతుంది. కానీ, అక్కడ పాలకులకి గుడిలో భక్తులతో నిరంతరం రద్దీగా ఉందని చూపించాలన తాపత్రయం ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. నటన సూత్రధారుడైన ఆ దేవుడికి ఈ నాటకం అవసరమా?

అమెరికా నుండి వెళ్ళినా, ఇండియాలోని ఇతర ప్రదేశాల నుండి వెళ్ళినా, ఎవరికి ఉండే సమయానుకూలతలతోనే వారు వెళ్ళగలరు. అది పేదవాడైన గొప్పవాడైన ఒకటే. కాకపోతే పేదవాళ్ళు ఎంతోకాలంగా డబ్బులు కూడపెట్టుకుని వెళ్ళితే, గొప్పవాడు తనకి కుదిరిన సమయం చూసుకుని వెళ్తాడు. డబ్బులున్నాయి కాబట్టి ప్రత్యేక దర్శనం టికెట్టు తీసుకుని త్వరగా దర్శనం ముగించుకుని వెళ్ళిపోవాలని కోరుకుంటాడు. అదికూడా ఈ కొత్త పద్ధతి మొదలు పెట్టిన తరువాతే. ఒకప్పుడు అయితే ప్రతి ఒక్కళ్ళు వీలైతే పరపతి, సిఫార్సులు మాత్రమె వాడుకునే వారు. అయితే మరికొంత మందికి ఎటువంటి ఆంక్షలు లేవు. అటువంటి వారు మంత్రులు, పెద్ద పదవుల్లో ఉండేవాళ్ళు, చలన చిత్ర పారిశ్రామికులు మొదలైన వారు. వీరి ముందు మనం ఎంత డబ్బులు పెట్టి టికెట్టు కొనుక్కున్నా వ్యర్ధమే.

ఇది ఇలా ఉండగా మరొక రకమైన ప్రత్యేక దర్శనాలు ఉన్నాయి. శ్రీవారి కళ్యాణం అని, వసంతోత్సవం అని, అభిషేకసేవ అని, ఈ పలు రకాలైన సేవలు చేయించే వారికి కూడా ప్రత్యేక దర్శనం ఉంటుంది. అంటే వారిని సరాసరి దేవుడి ముందుకి తీసుకు వెళ్లుతారని కాదు. క్యూ కొంచం తక్కువ ఉంటుందన్నమాట! సేవలు కనువిందుగా ఉంటాయి. భక్తులందరికి చాల ఆనందం కలిగిస్తుంది. కాని అక్కడ కూడా చాల తొక్కిసలాట. బాగా బాధ కల్గించే విషయం ఏమిటంటే, సేవ అయిపోయిన తరువాత ఇద్దరు బ్రాహ్మణులు కేవలం దక్షిణ కోసం చెయ్యి చాపి కూర్చోడం. నాకు చాల ఆశ్చర్యం వేసింది. నేను నా ముందు ముగ్గురు అర్చకులు ఉంటే, ఒకరు తీర్థం, ఒకరు శఠగోపం పెడుతున్నారు కాబోలు, మరొకరు ఆ కార్యక్రమానికి ప్రధాన అర్చకులు కావచ్చు అనుకున్నాను. తీరా దగ్గరకు వెళ్లేసరికి ఒక్కరు మాత్రమే తీర్థం ఇస్తున్నారు, మిగిలిన ఇద్దరు చేతులు చాపి కూర్చున్నారు దక్షిణ కోసం. మరి ఈ పూజారులకి ఇచ్చే జీతం చాలకా? లేదా ఎంత వీలైతే అంత ఈ రూపేణా సంపాదించాలనా? కనకవర్షం కురుస్తున్న ఈ గుడిలోని అర్చకులకి జీతాలు తక్కువా? లేక అత్యాశా?? చాలా  సిగ్గు పడవలసిన విషయం ఇది. అందుకు వారు చెప్పే సమాధానం వేరేగా వుంటుంది. వారు కూడా కాంట్రాక్టు మీద ఈ కార్యక్రమాలకు ఎంపిక అవుతారు కనుక తమ పై ఆధిపత్యం చెలాయించే TTD అధికారులకు ముడుపులు చెల్లించాలి. ఈ విధమైన అవినీతి ఉన్నంతవరకు సామాన్య భక్తులకు అన్ని రకాల తిప్పలు తప్పవేమో?

ఇక గుడి లోపల విషయాలకి వద్దాం. ఒకప్పుడు ద్వజస్థంభం ప్రక్కనుండి నుండి వెండి ద్వారం నుండి వెళ్ళే వాళ్ళం. ఇప్పుడు ద్వజస్థంభాన్ని తాకే అవకాశం లేదు. ఆ దారి కేవలం ప్రత్యేక వ్యక్తులకి మాత్రమే కేటాయించారు. తరువాత ఒక ప్రక్కనుండి వెళ్లి ఇంకో ప్రక్కనుండి బయటికి వచ్చేవారు. ఇప్పుడు రెండు ప్రక్కలనుండి రెండు క్యూలు, మధ్యలో ద్వజస్థంభం నుండి ఒక క్యూ. వెండి ద్వారం దగ్గర ఒక్కసారిగా తాకిడి ఎక్కువ అయ్యిపోయింది. ఇందువల్ల మామూలుగా పట్టే సమయం కంటే ఇంకా ఎక్కువ సమయం పడుతుంది ప్రతి మనిషికి. ద్వారం దగ్గర ఒక్కసారిగా ముప్పై, నలభై మంది లోపలకి వెళ్ళాలన్న ప్రయత్నంతో సాటి మనిషి మీద ఉండాల్సిన కనీస గౌరవం పూర్తిగా నశించిపోయింది. దీనికి తోడు, అందరు ఒకసారే గుడి ముఖద్వారం దగ్గర ప్రవేశించడం, తరువాత ఒకే సారి నిష్క్రమించడం వల్ల, వచ్చేటప్పుడు, వెళ్ళే వారిని,

వెళ్ళేటప్పుడు, వచ్చేవారిని పది పదిహేను నిముషాలు ఆపేస్తున్నారు. దాంతో బయట ఎక్కువమంది భక్తులు కిక్కిరిసి పోతున్నారు.

ప్రశాంతంగా, కొన్ని సంవత్సరాలుగా ఒక పద్దతిగా నడుస్తున్న వ్యవస్థ, ఒక్క సారిగా అల్లకల్లోలం అయ్యిపోయింది. దీనివల్ల తోపుడెక్కువ అయింది, భక్తి తక్కువయ్యింది. గుడి ఆవరణలో ఒకళ్ళనొకళ్ళు తిట్టుకుంటున్నారు కానీ దేవుడిని తలచుకోవటంలేదు. పిల్లలు నలిగి పోతున్నారేమో అన్న భయం ఎక్కువయ్యింది కాని, గోవిందా గోవిందా అని మనసార గొంతువిప్పి స్మరించటం లేదు. ఈ తోపులాటలలో కొందరు భక్తులు పడిపోతున్నారు. తోపులాట అన్నది మాత్రం మన రక్తంలో లేని క్రమశిక్షణ కావచ్చు. ఎందుకంటే ఇక్కడ అంటే అమెరికాలో డిస్నీ లాంటి ప్రదేశాలకి వెళ్లినప్పుడు కిక్కిరిసి ఉన్న జనం చూస్తాం. ఒక అవగాహనతో నడుస్తారు. అక్కడ రైడ్స్ లో ఒక్కోసారి రెండు మూడు గంటలు నిల్చోవలసి వస్తుంది. అందరు క్యూలో నియమబద్ధంగా నిల్చుంటారు. అదెలా వీరికి సాధ్యమైందో అర్థం కాదు. Barricades పెట్టకపోయినా అలాగే ఒకరి వెనక ఒకరు నిల్చుంటారు. ఇది నిజంగా ప్రశంసించాల్సిన విషయం.

దీనికంతా TTD పాలక వర్గం అసమర్దత ముఖ్య కారణం. కానీ ఇది అసమర్థతా, అవినీతా లేక నాటకమా అని కూడా మనం ఆలోచించాలి!

ఇప్పుడు గర్భగుడిలోని విషయాలకి వద్దాం. మునుపు రకరకాల పూజలు విగ్రహానికే చేసేవారు. మరి ఇప్పుడు, గత సంచికలో చెప్పిన విధంగా రకరకాల సేవలు ఉత్సవ విగ్రహాలకే చేస్తున్నారు. అవన్నీ గుడి బయట వసతుల్లో జరుగుతున్నాయి. లోపల మూలవిరాట్ కి ఒకటి రెండు సార్లు హారతి ఇస్తున్నారేమో తెలీదు. భక్తుల ముందు మాత్రం ఇలాంటివేమీ చేయటంలేదు. భక్తులకి తీర్థం ఇచ్చి శఠగోపం పెట్టేవారు ఒకప్పుడు. ఇప్పుడు అదికూడా లేదు. కేవలం, మనం ఆ వేంకటేశ్వరుని ముందు, క్షణం పాటు నిల్చొని, చేతులెత్తి దణ్ణం పెట్టుకోవడం తప్ప మనకి మరొక పని లేదు.

ఇక దర్శనం తరువాత బయటికి వచ్చి ప్రసాదం తీసుకోవడం. ఇది ఒక మాదిరిగా బాగానే జరుగుతుంది. కాకపోతే ఒకప్పటి ప్రసాదంకి ఇప్పటి ప్రసాదంకి రుచి రీత్యా చాలా వ్యత్యాసం వచ్చింది. తిరుపతిలో ప్రసాదం అంటే ఇక అలాంటి రుచి మనం ఇంట్లో ఎంత కష్టపడ్డా అంత అద్భుతంగా రాదు అన్న భావం ఉండేది. అలాగే

ఆయన లడ్డు, వడ కూడా. ఒకప్పుడు రెండు చేతులకి సరిపడేంత లడ్డు, బాదంపప్పులు, జీడిపప్పులతో, కిస్మిస్లతో, పటిక బెల్లాలతో, యాలకులతో, బూందీ కొంచం కొంచం కనిపిస్తూ అత్యంతమైన రుచితో, చూస్తేనే తినాలన్న ఆదుర్దత ఉండేది. ఇప్పుడు టెన్నిస్ బంతి అంత చిన్నదైపోయి, యాలకులు, అక్కడక్కడా భూతద్దం వేసుకుని వెతికితే ఒకటి అర్ధ జీడిపప్పులు కనిపిస్తున్నాయి. ఇక మిగిలిన పదార్థాలేమీ లేవు. లెక్కపెట్టలేనన్ని డబ్బులు వచ్చే ఈ గుడిలో ఇంత కనాకష్టంగా తయారు చేస్తున్న ప్రసాదాలు చూస్తే 'పాపం దేవుడు' అనిపిస్తుంది.

మరి సేవలన్నీ బయటకి పెట్టినప్పుడు తరలించినప్పుడు, ఇక వంటశాలలో ప్రసాదం వండి, గుడిలో ఇవ్వడం మానేసి, బయటికి వచ్చినప్పుడు క్యూ ఏర్పాటు చేసి ఇస్తే కొంత రద్దీ తగ్గుతుంది. వంటశాల కూడా బయటికి మార్చేస్తే పెద్ద పెద్ద అండాలు పట్టుకుని తప్పుకోండి తప్పుకోండి అని భక్తులని అంటూ, వాళ్ళని విసుక్కుంటూ ప్రసాదం పంచిపెట్టే స్థలానికి వంటశాలకి మధ్య తిరుగుతున్న కార్యకర్తలకి కూడా మనసుకి శాంతిగా ఉంటుంది. ఒకప్పుడు, లడ్డులు పంచిపెట్టేది కూడా గర్భగుడిలో ఉండేది. ఇప్పుడు అదికూడా బయటకి మార్చారు కదా? అలాగే వంటశాల కూడా బయటికి మార్చేయచ్చు. దీనివల్ల, చాలా స్థలం కలిసి వొస్తుంది కూడా. క్యూ పద్దతిని సక్రమంగా అమలు పరచవచ్చు.

చాలా అభివృద్ధి చెందిన విషయం ఏమిటంటే, అతిధిగృహాలు. మన ఆర్ధిక పరిస్థితికి తగినట్టుగా వచ్చాయి. అలాగే అన్నశాలలు కూడా చాలా ఉన్నాయి. తిరుమలకి ఎక్కడానికి కాలి మార్గం కూడా చాలా సానుకూలతగా ఉన్నది. మధ్యమధ్యలో తాగడానికి తినడానికి కూడా చాలా వసతులు ఏర్పాట్లు చేసారు. అలాగే కల్యాణకట్ట కూడా సానుకూలంగా ఉంది. కొట్టులన్నీ ఒక చోట పెట్టి గుడి చుట్టుపక్కల రద్దీ తగ్గించారు. అయితే శుభ్రత ఇంకా మెరుగు పడాలి. స్వామి పుష్కరిణిని కూడా బాగా కట్టి, ఇప్పుడు మంచి నీళ్లతో ఒక స్విమ్మింగ్ పూల్ లాగ బాగా చేశారు.

ఆచారంతో ఎంత నిష్ఠగా దేవుడికి ప్రసాదం వండుతారో, భక్తులకి పెట్టే ఉచితభోజనం కూడా అంతే నిష్ఠతో వండి శుభ్రంగా పెడితే, ఎక్కడెక్కడనుండో డబ్బులు కూడగట్టుకుని ఆ దేవదేవుని చూడటానికి వచ్చిన భక్తులకి ఆనందం కలుగుతుంది. అలాగే గెస్ట్ హౌసులు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉంటె బొద్దింకలు, సాలీడులు, చీమలు మన మీద సవారీలు చెయ్యకుండా ఉంటాయి.

www.sirimalle.com

మీరు గమనించి ఉంటారు. మూడు సంచికలనుండి ఎన్నో పేరాలు వ్రాసిన ఈ అంశంలో కేవలం ఒక పేరాలో, కొద్ది విషయాలలో మాత్రమే బాగున్నాయని చెప్పగలిగాను. అంటే ఒక 20 శాతం మాత్రమే మనకి తృప్తి కలుగుతుంది. ఈ మిగిలిన 80 శాతం మెరుగు పడటానికి ఇంకా ఎంత కాలం పడుతుందో!!!

గుడి ఆవరణలో అడుగుపెట్టగానే ఒక మనశ్శాంతి కలగాలి. మళ్ళీ ఈ అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడగలగాలి. ఈ ప్రసాదం మళ్ళీ ఎప్పుడు దొరుకుతుందని ఉవ్విళ్ళూరాలి. ఇప్పుడు ఈ స్థలం ఒక రకమైన వ్యాపార కేంద్రంగా మారిపోయింది. వసతులు, సదుపాయాలతో నేటి పరిస్థితులకు తగినట్టుగా రూపురేఖలు దిద్దుకున్న తిరుమల, ముఖ్యంగా కార్యకర్తల్లో, చిత్తశుద్ధి, నీతి ప్రవర్తన, సరళత పెంపొందిస్తే, ఒకనాటి స్వచ్ఛత మళ్ళీ మనం చూడగలుగుతాము. ఇందుకు ఎవరు నడుముకడతారో మరి??

**ఓం నమో వెంకటేశాయ!**

## విదేశాలలో ఉన్న భారతీయులు నాడు - నేడు

"జనని జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరియసీ, ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" ఇలాంటి మాటలే విదేశాల్లో ఉన్న ప్రతి భారతీయుని మనసులో మెదిలేది. చాలా స్వచ్ఛంద సంస్థలకి రూప కల్పన ఇలాంటి కట్టుబాటు ఉన్న మనసుల నుండే జరిగింది.

అలాగే ఇదివరకు విదేశాలనుండి మళ్ళీ భారత దేశంకి  వెళ్లాలంటే, కొన్ని సంవత్సరాలు పట్టేది. కారణం, ప్రతి కుటుంబం తమ టిక్కెట్లకి, తమ ఖర్చులకి, ఇంకా అక్కడ వారికి బహుమతులు ఇవ్వడానికి డబ్బులు కూడబెట్టడానికే నాలుగు ఐదు సంవత్సరాలు పట్టేది. కొందరికి ఆ అదృష్టంకూడా ఉండేది కాదు. కానీ, ఈ ఐదు సంవత్సరాలు ఇక్కడ ఉన్న తిండి తిని, ఇక్కడ వస్తున్న టీవీ ఛానల్ ప్రోగ్రామ్స్ చూసి, ఇక్కడి మనుషులతో తిరిగి, విసిగిపోయి, ఎప్పుడు ఇండియాకి వెళ్దామా అని  ఆత్రంగా ఎదురు చూసే వాళ్ళు.

అలాంటి సమయంలోనే కొందరు నడుము కట్టి, హోటల్స్, ఇండియన్ కొట్లు పెట్టారు. ఉత్తర భారతీయులు ఎక్కువగా వలస రావడం వల్ల వారి రుచులు వారి దినుసులు ఎక్కువ వాడుకలోకి వచ్చాయి. అలాగే మరికొందరు తమకున్న పరిజ్ఞానంతో కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. నాకు తెలిసి

www.sirimalle.com

అమెరికాకి 1965 ప్రాంతంలో డాక్టర్లు ఎక్కువగా చదువుకోవడానికి వలస వెళ్ళే వారు. ఒక్కప్పుడు, ఒక్కో పెట్టె పరిమితి 75 పౌండ్లు కాబట్టి కొందరు దాదాపు ఒకటి రెండు సంవత్సరాలకి సరిపడే దినుసులు, వీలైనన్ని పప్పులు, చింతపండు, వగైరా తెచ్చుకునే వారు. పచారి దినుసుల అంగళ్లు అక్కడ ఇక్కడ వచ్చాయి కాబట్టి, కొంచం ధర ఎక్కువైనా ఇండియాకి వెళ్లలేని వారు ఈ కొట్లలో కొనుక్కునే వారన్నమాట. గుడి అన్న మాటే లేదు. ఇళ్లలోనే అందరు పూజలు చేసుకొనే వారు. పండగలన్నప్పుడు తెలిసిన పది మంది కలిసి, ఒకరి ఇంటికి వెళ్లి పండగలు జరుపుకునే వారు. మేము కూడా ఇండియాలో చేసుకున్నట్టే ఇక్కడ కూడా అన్ని పండగలు చేసుకుంటున్నాం అన్న తృప్తి కలిగేది. ఒక కుటుంబం కాకపోయినా, ఒకే కుటుంబంగా కలిసిపోయిన రోజులవి.

ఇక ఇండియా మాటకొస్తే, రెండు నెలల ముందునుండి, తన కొడుకు వస్తున్నాడు, తన కూతురు వస్తుంది అని ఎదురు చూసిన తల్లిదండ్రుల హడావిడి అంత ఇంత కాదు. ఉన్న రెండు వారాలు ఇక చాలు అన్నంతగా అమ్మ తెగ వంటలు చేసి, నాన్న ఉన్న కబుర్లన్నీ చెప్పి, అక్కలు, చెల్లెళ్ళు, అన్నలు, తమ్ముళ్లు ఒక్క క్షణం వదిలి పెట్టని వాతావరణం నుండి తిరిగి వెళ్లి పోతున్నప్పుడు కలిగే దిగులు ఇంతా అంత కాదు. మా అమ్మాయి వచ్చింది, మా అబ్బాయి వచ్చాడు, వీడు నా మనవడు, మనవరాలు అని అడిగిన వారికి అడగని వారికి పరిచయం చేస్తూ, గర్వం, ఆనందం కళ్ళలో తొణికిసలాడుతున్న ఆ తల్లిదండ్రులని చూస్తూ, ఇక మళ్ళీ ఎప్పుడు వస్తానో ఇండియాకి అనుకుంటూ వీడ్కోలు చెప్పడం ఎవరివల్లా కాదు.

ఇది 1950, 1960 దశాబ్దాల మాట!

మొదట్లో అమెరికాకి ఎక్కువగా డాక్టర్లు వచ్చేవారు. నెమ్మనెమ్మదిగా ఇంజనీర్లు రావడం మొదలుపెట్టారు. ఇక్కడ డాక్టర్లకి కొదవలేకపోవడం వల్ల అనుకుంటా, డాక్టర్లకి వీసాలు ఆపేసారు. ఇక ఇండియాలో డాక్టర్లకి విద్యాభ్యాసం కోసం అమెరికాకి రాగలిగే అవకాశం పూర్తిగా పోయింది. దానితో వేరే మార్గాలు వెతుక్కున్నారు. వారు పెళ్లిళ్లు చేసుకొని లేదా ఇక్కడ డాక్టర్లకు సమావేశం కోసం ఇచ్చే వీసాలు తీసుకొని రావడం ఆనవాయితీ అయ్యింది. అలాగే ఇక్కడకి వచ్చిన ప్రతి ఒక్కరు పెళ్లిళ్లు చేసుకుని తమ కుటుంబాలని తెచ్చుకోవాలంటే కూడా ఇబ్బంది అయ్యింది. ఇక్కడ ఉన్న నిబంధనల ప్రకారం తమ తమ భాగస్వాములని తెచ్చుకోవాలనుంటే కొన్ని సంవత్సరాలు పట్టేది. అయితే అన్ని రకాలైన నిబంధనలకి మరో రకమైన పథకం

www.sirimalle.com

వెతుక్కున్నారు. సరే బాగానే ఉంది. ఒకప్పుడు తల్లి తండ్రులని తెచ్చుకోవాలంటే గగనం అయ్యేది. ఇప్పుడు 10 ఏళ్ళకి వీసా ఇచ్చేయడం వల్ల, ఎన్నిసార్లన్నా రావచ్చు, తిరిగి వెళ్ళొచ్చు. వేరే దేశాలలో ఇంకా ఇబ్బందులున్నా, అమెరికా ఔదార్యాన్ని ఇక్కడ నిజంగా మెచ్చుకోవాలి. మన ఇండియాకి రకరకాలైన దారులు తెరిచింది. అయితే మనం మాత్రం ఇంకా ఏదో తక్కువ చేస్తుందనే భావిస్తూ ఉంటాము. కారాలు మిరియాలు నూరుతూ ఉంటాము. విద్యాభ్యాసం కోసం ఒక్కప్పుడు వీసా దొరికితే మహా భాగ్యంగా భావించే మనస్తత్వం నుండి ఎవడి కోసం ఇస్తాడు వీసా, వాడికి(అమెరికాకి) నా అవసరం ఎక్కువ అన్న ఒక పాటి గర్వం మొదలైంది మనవాళ్ళలో. ఇది ఎంతమాత్రం సబబు?

మునుపు పెద్ద పెద్ద నగరాలలో మాత్రమే ఎక్కువగా కనబడే భారతీయులు ఇప్పుడు మారుమూల ప్రాంతాలలో కూడా భారతీయుత అన్న ఒక గుర్తింపు తీసుకొచ్చాము. బ్రిటిష్ పరిపాలనలో సంపదలన్నీ కోల్పోయిన ఇండియా నేడు లండన్లో మాత్రమే కాదు, ప్రతి విదేశంలో కాలు పెట్టి రవి అస్తమించని భారతదేశం అయ్యింది. అమెరికా ఒక్కటే కాదు, ఏ దేశంలో వీసా దొరికినా చాలు ఆ దేశానికి వెళ్లిపోవాలన్న ఆకాంక్ష మనలో ఎక్కువయ్యింది. ఒకరకంగా గర్వించ దగ్గ విషయం. ఒకరకంగా బాధ పడవలసిన విషయం కూడా. మనవాళ్లు అవకాశం ఎక్కడ దొరికినా ఫర్వాలేదు వెళ్ళిపోతాను అన్న ఆలోచనకి, ఇండియాలో ఉండటం వల్ల నాకు అవకాశాలు, దానికి తగ్గ ఆదాయం లేదు, అందుకే ఎక్కడ దొరికితే అక్కడికి వెళ్ళిపోతాను అన్న ఆలోచనకీ ఉన్న తేడా అది. విదేశాలకి వెళ్లి మళ్ళీ ఇండియాని సుసంపన్నం చేస్తున్న ఎంతో మంది ఎన్.ఆర్.ఐ లకి నిజంగా జేజేలు. కానీ ఇప్పటికీ ఇంకా మన దేశంలోనే ఉండాలి అన్న భావన, సంతృప్తిని కలిగించలేని భారత ప్రభుత్వానికి ఇది పరమ దురదృష్టం.

1960 నుండి ఇప్పటివరకు గమనిస్తే, అక్కడక్కడ కుటుంబాల్లో ఒకరు మాత్రమే విదేశాల్లో ఉన్నారు అన్న మాట నుండి, దాదాపు ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరన్నా విదేశాల్లో నివసిస్తున్నారు అన్న మాట వినపడుతున్నదంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఒక్కప్పుడు కొద్ది పాటి విమానాలు, చిన్న విమానాలు ఉండేవి. వాటిని బర్తీ చెయ్యాలంటే గగనం అయ్యే రోజులనుండి, ఇప్పుడు ఎయిర్ బస్సులు ప్రతి రోజు ప్రతి రెండు మూడు గంటలకి మన ఆర్.టి.సి. బస్సుల్లాగా జనాలని నింపుకొని వెళ్తున్నాయన్నది కూడా వాస్తవమే. ఇంజినీర్ల వలస దీనికి ముఖ్య కారణం. ఇక్కడ కంపెనీలు ఇండియాలో పెట్టడం వల్ల కొందరు

www.sirimalle.com

వ్యాపార రీత్యా రెండు రోజులకి కూడా వెళ్ళి వచ్చే వారున్నారు. ఇక అక్కడ తల్లి దండ్రులకి ఇదివరకులాగ ఎదురు చూడటం తక్కువయ్యింది. ఒక్కప్పుడు చేతి వంట చేసిపెట్టడం నుండి ఇప్పుడు బయట కొని ఇచ్చేయడం అలవాటయ్యింది చాలా ఇళ్లల్లో. ఇది కొంత బాధాకరం. స్వయంగా తయారు చెయ్యడంలో ఒక అనురాగం ఆప్యాయతలు ఉంటాయి. అలాంటి నియమాలు దూరమై, కొన్ని సంప్రదాయాలు తగ్గి, కొంత యాంత్రికమైన జీవనం అలవాటైంది. ఇక ఇండియాలో ఉండే వాళ్ళకి విదేశీ తిండి వ్యామోహం ఎక్కువయ్యి బయట తిండికే ఎక్కువగా అలవాటు పడుతున్నారు. ఇది మరొక సమస్య.

చాలా విషయాలు గమనిస్తే భారతీయులు చాలా మంది సాంప్రదాయబద్దమైన జీవితాన్ని గడపటానికి ప్రయతిస్తున్నారు. కానీ మొదట వలస వచ్చినవాళ్లలో మాత్రం అమెరికా అన్న వ్యామోహం ఎక్కువగా ఉండటం వల్ల, మన ఆంగ్లం వారికి సరిగ్గా అర్థం అవ్వదేమో అని, వారిలాగా మాట్లాడటం, వారి లాగ నడవడం, వారిలాగా దుస్తులు వేసుకోవడం అలవాటు చేసుకున్నారు. అలా చెయ్యక పోతే మనం అవమానం పాలవుతామేమో అన్న ఉద్దేశం కాబోలు. కానీ ఇంట్లో మాత్రం వీలైనంత వరకు భారతీయ సంప్రదాయం అనుసరించేవారు. ఇక పిల్లల విషయం వచ్చేసరికి వారిని అమెరికా వాతావరణానికి అలవాటు చెయ్యలేక ఇండియా అలవాట్లు నేర్పలేక సతమతమైయ్యారు.

ఇక పోను పోను ఈ డాక్టర్లు ఇంజినీర్లు వేరే డిగ్రీలు ఉన్నవాళ్ళని పెళ్ళిళ్ళు చేసుకున్నప్పుడు కొందరు చిన్నప్పుడు డాన్స్ నేర్చుకొని వదిలేసిన వాళ్ళు, చిన్నప్పుడు సంగీతం నేర్చుకొని వదిలేసిన వాళ్ళు ఉండటం జరిగింది. అయితే వారి పుణ్యమా అని, కొన్ని సాంప్రదాయ సంగీతం, నృత్యము నేర్పే కళాశాలలు మొదలైయ్యాయి. ఇలా చిన్నప్పుడు నేర్చుకున్న వాళ్ళు, ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకొని, మళ్ళీ ఇండియాకి వెళ్ళి శిక్షణ తీసుకుని, ఇక్కడ పిల్లలకి అనువుగా వారి పద్దతిని మార్చి, వారిలో ఉత్సాహం పుట్టించి, రకరకాలైన కళలు నేర్పిస్తూ వచ్చారు. వాళ్ళు నేర్పించినప్పుడు గురు దక్షణ తీసుకోవడంలో తప్పేముంది? మరి ఇప్పుడు ప్రతి ఒక్కరు యూట్యూబ్ లో సినిమా పాటలు చూసి వాటినే వాళ్ళకి వచ్చిరాని విధంగా నేర్పిస్తున్నారు. సినిమా పాటల మోజు ఉన్నవాళ్లు ఎక్కువై, అక్కడ లలిత కళలకి ఫీజు ఇవ్వడానికి ఇష్టపడరు కానీ, ఇక్కడ మాత్రం డబ్బులు ఖర్చు పెట్టడానికి వెనకాడటం లేదు.

www.sirimalle.com

1960 నుండి నేటికి చాలా భారతీయులు వచ్చారు. అప్పట్లో, చాలా మందికి ఈ సంగీతం, నృత్యం అంటే ఒక గౌరవం ఉండేది. నేడు వస్తున్న వారికి ఎక్కువగా చలన చిత్రాలే ఒక కొలమానం అయ్యి, లలిత కళలు అంటే విసుగు ఎక్కువయి, పిల్లలకి నేర్పించడం మానేస్తున్నారు. మరి కొందరు నేర్పించాలని ప్రయతిస్తున్నారు కానీ, పిల్లలకి నేర్చుకోవడం వల్ల ఎంత ఉపయోగమో వివరించలేకపోతున్నారు. మరి కొందరు, వేరే వాళ్ళ పిల్లలు నేర్చుకుంటున్నారు, రంగ ప్రవేశం చేస్తున్నారు, మా పిల్లలు కూడా అలాగే చెయ్యాలి అని ఒకరికి ఒకరు పోంతన పడుతున్నారు. ఉద్దేశ్యం ఏదైనా నేను గమనించింది, ఈ కళలు నేర్చుకున్నవారు మళ్ళీ కాలేజీలకు వెళ్లినప్పుడు ఉపయోగిస్తున్నారు. ఈ ఒక్కటి చాలు తల్లిదండ్రులకి తృప్తి కలిగించటానికి. కొందరు తల్లిదండ్రులు మాకు నచ్చదు కాబట్టి మా పిల్లలకి కూడా నచ్చదు అన్న దురభిప్రాయంతో ఉన్నారు. మరి కొందరు అబ్బా అందరు ఇండియన్స్ అని మూతి విరిచినవాళ్ళని కూడా చూసాను. మరి అన్నవాళ్ళు ఇండియన్స్ కాదా అండీ? నేటి భారతీయులు కూడా Ballet లని వెంపర పడకుండా, ఈ కళలు నేర్పిస్తే బాగుంటుంది కదా?

సరే, ఇంకో విషయానికి వద్దాం. మనవాళ్ళకి అవకాశం వస్తే చాలు, దానిని ఎలా వ్యాపారంగా చెయ్యొచ్చు అన్న ఆలోచన, ప్రపంచాన్ని మొత్తం మనమే ఏలాలి అన్న స్వార్థం ఎక్కువగా కనిపిస్తుంది. ఇంటర్నెట్లు రావడం వల్ల, చాలా మంది స్కైప్ ద్వారా నేర్చు కోవడానికి అలవాటు పడుతున్నారు. తప్పు కాదు. కానీ, మొట్ట మొదటి శిక్షణ ముఖ్యంగా డాన్స్, సంగీతాల్లో గురువు ఎదురుగ కూర్చొని నేర్పించడంలో చాలా మంచి పునాది పడుతుంది. ఒకప్పుడు, శని ఆదివారాలు, గంట ప్రయాణం చేసి, దూరదూర ప్రదేశాల్లో ఉన్న టీచర్స్ దగ్గరకి తీసుకెళ్ళి నేర్పించారు తల్లి దండ్రులు. మరి నేటి తల్లి దండ్రులో? ఇంట్లో ఒక ఐపాడ్ ఇచ్చి ఎక్కడో ఇండియా నుండి ఎవరితోనో నేర్పిస్తున్నారు. వారు మాట్లాడేది వీరికి అర్థం కాదు. వీరు మాట్లాడేది వారికి అర్థం కాదు. ఇది మంచి ప్రయత్నమా? ఎందుకంటే, ఇక్కడున్న పిల్లల్లో వాక్శుద్ధి తక్కువ. ఓర్పు తక్కువ. దగ్గరుండి నేర్పిస్తేనే చాలా కష్టపడాలి. ఇక ఈ రకమైన పద్ధతిలో నేర్పిస్తే ఎంత క్షుణ్ణంగా నేర్చుకుంటారు?

ప్రస్తుతం ఇక్కడకి వస్తున్న చాలామందికి ఇటువంటి విద్యల మీద అవగాహన ఏ మాత్రం లేదు. ఇక పిల్లలు ఏమి నేర్చుకుంటున్నారో సరిదిద్దగలిగే అవకాశం ఎక్కడ? ఈ ప్రపంచాన్నంతా ఏలాలనుకున్న సంస్థలు, మంచి గురువుల నుండి విద్యార్థులని తీసుకెళ్లి పోతున్నారు. ఇక తల్లిదండ్రులు కూడా, అబ్బా ఈపూటకి

ఇంట్లోనే ఉండొచ్చు అన్న సుఖానికి అలవాటుపడి వీళ్ళనే ఆశ్రయిస్తున్నారు. ఇది నిజంగా చాలా బాధాకరం. మరి ఆటలని కూడా స్కైపులో నేర్పించాలి. ఏమంటారు? అమెరికన్లని చూడండి. ఎంత ప్రాముఖ్యత ఇస్తారో? క్రమం తప్పకుండ భార్యాభర్తలు ఎవరికి వీలైతే వారు పిల్లల్ని క్లాసులకి తీసుకెళ్తారు. ఉచితంగా పని చేస్తారు. మరి మన భారతీయులు ఎక్కడన్నా ఇలా ఉచితంగా పిల్లల కోసం పనిచేస్తారా? అమెరికన్లగా మాట్లాడాలి, బట్టలు వేసుకోవాలి, వాళ్ళతో కలిసి తిరిగితే మాకు చాలా గౌరవం అనుకున్న ప్రతి ఒక్కరు, ఈ లక్షణాన్ని ఎందుకు అలవర్చుకోరు?

మనం విదేశాల్లో ఉన్నప్పుడు మనని మరిపించడాని కోసం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ. ఒక పండగైతే కానీ, ఒక గుడికి వెళ్లడం కానీ, ఒక విద్య నేర్చుకోవడం కానీ. ఇది కేవలం మన సాంప్రదాయం, మన కళలు మన తదుపరి సంతతికి అందించాలన్న తపన. అసలు, మన దగ్గరకి వచ్చినప్పుడే అది పలచపడిపోయింది. కానీ ఎదో తపన, తాపత్రయం, అవి మాసిపోకూడదాని, వాటిని నిలబెట్టాలని. మరి అలంటి ఆశయాలతో మొదలు పెట్టి చివరికి అది ఒక వ్యాపారంగా మార్చడం ఎంత దురదృష్టకరం? మళ్ళీ ఇక్కడ ఒక వంద గుడులు, ఒక వంద సంస్థలు. అందులో వాగ్వివాదాలు. ఏ స్వచ్ఛమైన ఆలోచనతో మొదలు పెట్టారో పూర్తిగా మర్చిపోయారు.

మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మనని మనం మర్చిపోకూడని తలపెట్టిన ఒక యజ్ఞం. కానీ ఆ యజ్ఞంలో మనమే బూడిద అయ్యిపోయేట్టు చేస్తున్న అవివేకత్వం. ఎక్కడ గీత గీయాలో, ఎక్కడ ఆపాలో తెలియని స్వార్థం. అందరు వారికీ వారే సర్దిచెప్పుకుంటున్నారు మేము నూటికి నూరుపాళ్లు నిస్వార్థులమని. మరి అలాంటివాళ్ళకి బోధించడానికి, జ్ఞానోదయం కలిగించడానికి ఏ బుద్ధుడు పుడతాడో??

www.sirimalle.com